# పల్లె వెలుగు

తెలుగు దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

సబ్ ఎడిటర్ : మహేష్ యాదవ్



తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 3 సంచిక : 55 ఎడిటర్: యం.డి. ఎజాసోద్దిన్ 25-02 - 2025 పేజీలు : 12




# కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతుంది బీజేపీనే..

- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- ఫోన్‌ట్యాపింగ్‌లో కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతుంది బీజేపీనే..
- రాష్ట్రానికి మోడీ ఇచ్చిందేమీ లేదు..8 మంది ఎంపీలు ఉండి దండగే
- ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కలలు
- ఫామ్‌హౌస్ నుంచి కుట్రలు
- పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం
- రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి
- భావోద్వేగాలు రెచ్చగొట్టి వీధినాటకాలు ఆడటమే బీజేపీ పని
- చెప్పిన పనులు చేశాం.. చేస్తున్నాం
- ప్రజా సంక్షేమమే మా లక్ష్యం : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నిజామాబాద్‌డెస్క్/కంఠేశ్వర్/ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధులు/మంచిర్యాల
'ఉపఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అని కేటీఆర్, హరీశ్‌రావు అంటున్నారు. 3లో

## పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



19వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
9.7 కోట్ల మంది రైతులకు రూ.22 వేల కోట్లను విడుదల చేసిన కేంద్రంఒక్కో రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.6 వేలు
రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం-కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి.

### దేశానికి అన్నం పెట్టే రైతన్నతో కన్నీళ్లు పెట్టిస్తున్నారు..

## కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు విమర్శలు



కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు.



### వాళ్లకు మానవత్వం లేదు

## విపక్షాలపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

### అందుకే ఈ ప్రమాదాన్ని రాజకీయం చేస్తున్నారు

### మీడియాతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి

అమ్రాబాద్, : ఎస్ ఎల్ బీసీ దుర్ఘటనలో సహాయచర్యలను పర్యవేక్షించేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట ప్రమాద స్థలి దోమలపెంటకు సోమవారం ఉదయం చేరుకున్నారు. 3లో

# ప్రమాదంపై.. పట్టింపు లేదా?

### ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించారు

- ప్రచారం పేరుతో గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేస్తున్నారు
- ఘోర ప్రమాదంపై సీఎంకు సీరియస్‌నెస్ లేదు
- ఇట్లైతే రెస్క్యూ ఆపరేషన్ ఎలా ముందుకు వెళ్తుంది
- ముఖ్యమంత్రికే ఇంట్రెస్ట్ లేకుంటే అధికారులు ఏం చేస్తారు
- ఓట్లు, నోట్లే వారి తొలి ఎజెండాగా ఉన్నట్టుంది
- ప్రజలు గమనిస్తున్నారు, కర్రుకాల్చి వాతపెడతారన్న కేటీఆర్



హైదరాబాద్: రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు.. ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి, గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 3లో

# కాపాడడం.. కష్టమే!

బురదమట్టిని చూస్తే.. ఆశలైతే లేవు



### ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు..

### ఆక్వా ఐ పరికరాలతో సెర్చింగ్

మహబూబ్ నగర్: నాగర్‌కర్నూల జిల్లా దోమలపెంట వద్ద ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై విమర్శలు వస్తుండటంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం మేల్కొంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. 2లో



## ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడో స్థానం వస్తుంది: బండి సంజయ్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని జోస్యం
- ఓడినా, గెలిచినా పోయేదేమి లేనప్పుడు ప్రచారానికి ఎందుకొచ్చారని ప్రశ్న
- గత ప్రభుత్వం కుంభకోణాల కేసులను సీబీఐకి అప్పగించాలని డిమాండ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మూడో స్థానమే వస్తుందని సర్వేలన్నీ తేల్చేశాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 3లో

పల్లె వెలుగు

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

# కుల గణనపైన బిసి కమిషన్ విసతృత ప్రచారం





హైదరాబాద్, ఫిబ్రవరి, 24 ) కులగణన సర్వే విజయవంతమై, ప్రజల ఆశిస్తున్న మేరకు బి సి ల రిజర్వేషన్స్ శాతం పెంపునకు, బి సి కమిషన్ ఆధ్వర్యంలో బాపూ ఘాట్ వద్ద ప్రార్ధనలు. ఈరోజు బీసీ కమిషన్ చేపట్టిన 9వ రోజు కులగణన అవగాహన కార్యక్రమంలో భాగంగా నేడు బాపూ ఘాట్ లంగర్ హౌస్ ప్రాంతాల్లో పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా మహాత్మా గాంధీ అస్తికలు,చితాభస్మం ఉంచిన బాపూఘాట్ వద్ద చైర్మన్ జి.నిరంజన్, స్థానిక నేతలు పుష్పఅంజలి ఘటించి, కులగణన సర్వే విజయవంతంగా జరిగి ప్రజలు ఆశిస్తున్న మేరకు రిజర్వేషన్స్ శాతం పెరగాలని ప్రార్థించారు.తర్వాత లంగర్ హౌస్, (66) వార్డ్ వివిధ ప్రాంతాల్లో జి.నిరంజన్,స్థానిక పెద్దలు పర్యటించి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ జరిగిన తీరును పరిశీలించడం జరిగింది. వస్తున్న ఫిర్యాదులనుసరించి తమ ఇంటికి గణకులు తమ యొక్క వివరాలు నమోదు చేశారని, మరికొందరు తమ ఇంటికి స్టిక్కర్ అతికించారు కానీ వివరాలు నమోదు చేయలేదని అలాగే అధికారులు వచ్చినప్పుడు మేము తమ ఉద్యోగాలు వెళ్లామని తెలిపారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న చైర్మన్ సంబంధిత వార్డ్ ఆఫీసర్లకు రిసోర్స్ పర్సన్స్ కు వెంటనే వీళ్ళ వివరాల నమోదు చేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా టోల్ ఫ్రీ నెంబర్ 040 21111111 కాల్ చేసినప్పుడు స్పందించిన టెలి కాలర్స్ ఎన్యుమరేషన్ చేశారు. ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు తెలిసిన విషయం ఏమనగా కొంత ఎక్కువ శాతం కులగణన జరగలేదని తెలిసింది. దీనిపై స్పందించిన చైర్మన్ పూర్తిస్థాయిలో చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు . లంగర్ హౌస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జి.నిరంజన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన ఈ కులగణన కార్యక్రమం ప్రజలందరూ విజయవంతం చేయాలని తెలిపారు. 1931 లో ఆంగ్లేయుల కాలంలో జరిగిన కులగణన జరిగిన తరువాత తిరిగి మళ్లీ జరగలేదని చెప్పారు. ప్రభుత్వం కులగణన చేయాలని నిర్ణయించి 160 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది . కులగణన సరిగ్గా చేస్తే అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. రిజర్వేషన్స్ సరిగా అమలు చేయాలంటే కులాల వారీగా సంఖ్య అవసరం. ముఖ్యంగా మున్సిపాలిటీల కాల పరిమితి 2025 జనవరి 1కి, జెడ్పిటిసి, ఎంపిటిసి, యొక్క కాలపరిమితి 2024తో ముగిసింది. అలాగే జిహెచ్ఎంసి కార్పొరేషన్ పరిమితి జనవరి 2026 కు ముగియనున్నది. వచ్చే ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలంటే, రిజర్వేషన్స్ పక్కాగా అమలు చేయాలంటే అసలు బిసిలు ఎంతుందనేది తెలియాలి. కాబట్టి ఈ వివరాలు సేకరించడం జరిగింది. ఎందుకనగా రేపు పొద్దున కోర్టుకు కులగణన రిపోర్టును ఇస్తే కోర్టు కూడా అంగీకరిస్తుంది. మహారాష్ట్ర, అలహాబాద్ లో రిజర్వేషన్ లు ఖరారు చేయనందున, కోర్టు ఉత్తర్వుల మేరకు రిజర్వేషన్ లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఈ ప్రమాదాన్ని దృష్టి లో పెట్టుకుని ప్రభుత్వం ఎన్యుమరేషన్ ప్రక్రియను చేపట్టింది. అలాగే కేంద్రం నుంచి రాష్ట్ర పంచాయతీ లకు రావలసిన 5000 నుంచి 6000 కోట్ల రూపాయలు ఎన్నికలు జరగనందున, రాకుండా పోయినందుకు కూడా రిజర్వేషన్ లు ఖరారు చేసి ఎన్నికలు జరపాల్సి ఉంది. ఈ కార్యక్రమ కొఆర్డీనేటర్ గా చంటి బాబు వ్యవరించారు .ఈ కార్యక్రమంలో ఉస్మాన్ హల్ హజరి, ఎ.చంద్రశేఖర్, నరసింహులు, పరమానందం, శ్రీకృష్ణ, నరసింహారెడ్డి, షేక్ షకీల, హేమలత, వినోద్, సయ్యద్ హమీద్, సయ్యద్ హలీం, కిషన్,పసుపులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.లంగర్ హౌస్ పోలీస్ వారు బందోబస్తు ఏర్పాటూ చేశారు . ఆశన్న (బీసీ వెల్ఫేర్ ఆఫీసర్), శ్రీవాణి (అడ్మినిస్ట్రేటివ్ వార్డ్ ఆఫీసర్), లలిత కుమారి (డిపిఓ),రిసోర్స్ పర్సన్స్ సంతోషి, పుష్ప, రోజా రాణి, ఇందిరా పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లు లేకుండా

# పారదర్శకంగా నిర్వహించాలి

**-కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

వరంగల్,ఫిబ్రవరి, 24

వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ,ఏపిఓ, సూక్ష్మ పరిశీలకుల రెండవ శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26వ తేదీన ఉదయం ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్ లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడినదా లేదా అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకున్న మీదట తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల లోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నల్గొండ లోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీ.ఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పి.ఓలదే అని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పి.ఓ లు, ఏ.పీ.ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ విజయలక్ష్మి,, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి బాలకృష్ణ, సూపరిండెంట్ రంజిత్, ఎన్నికల శిక్షకులు,పిఓలు ఓపీవోలు తదితరులు పాల్గొన్నారు.




# పవిత్ర రంజాన్ కు ఏర్పాట్లను పూర్తి చేయాలి

**- కలెక్టర్ ప్రావీణ్య.**

హనుమకొండ, ఫిబ్రవరి, 24 పవిత్ర రంజాన్ మాసానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వచ్చేనెల రెండో తేదీ నుండి ప్రారంభమవుతున్న రంజాన్ మాసం పై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్, పౌరసరఫరాలు, తదితర శాఖల అధికారులతో పాటు పలువురు మత పెద్దలు పాల్గొని ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ గతంలో మాదిరిగానే రంజాన్ మాసానికి అధికారులు ఏర్పాట్లను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మార్చి రెండవ తేదీ కల్లా అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను సిద్ధం చేసి ఉంచాలన్నారు. మసీదుల వద్ద సరిపోయే తాగునీటి సౌకర్యాన్ని ఆర్డబ్ల్యూఎస్, జీడబ్ల్యూఎంసి అధికారులు కల్పించాలన్నారు. తాగునీరు అవసరమైన చోట్ల అదనంగా నీటి ట్యాంకర్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని , ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ జరగాలన్నారు. పవిత్ర మాసం కాబట్టి మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ముస్లిం ఉద్యోగులకు ఒక గంట ముందుగా ఆఫీసు నుండి వెళ్లేందుకు ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని, 24 గంటల పాటు దుకాణాలు తెరిచి ఉంటాయని తెలిపారు. శుక్రవారం, ముఖ్యమైన రోజుల్లో మసీదుల వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, అవసరమైతే అంబులెన్స్ ను కూడా సిద్ధంగా ఉండేటట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ముందుగానే ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఆర్డీవోలు, తహసిల్దార్లు తమ పరిధిలోని మసీదులలో ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. రంజాన్ పండగకు సంబంధించిన ఏర్పాట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మత పెద్దలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లను చేస్తామన్నారు. పవిత్ర రంజాన్ ఏర్పాట్లను రెవెన్యూ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ అధికారులు హెల్ప్ లైన్ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లయితే ఏవైన సమస్యలు ఏర్పడినట్లయితే ఆ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తమ శాఖ తరఫున ఏర్పాట్లను సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, నారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మురళీధర్ రెడ్డి, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.




# బాలల సంరక్షణ కేంద్రాలలో కనీస ప్రమాణాలు పాటించాలి

హన్మకొండ, ఫిబ్రవరి, 24 జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలనీ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏ వెంకట రెడ్డి అన్నారు, సోమవారం రోజున కలెక్టరెట్ మినీకాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షత జరిగింది, ఈ సందర్భంగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుచున్న బాల బాలికలకు వసతి, భోజనం, విద్యా, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను డిస్ప్లేచేయాలని సూచించారు. ఫిబ్రవరి 27 నుండి మార్చి5 వరకు జిల్లాలోని ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్ ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలియచేసారు. ఈలోగా ఆయా సంస్థలు, కొత్తగా ఏర్పాటు చేయబోయే సంస్థలకు వారి కనీస ప్రమాణాలు సంతృప్తికరంగా ఉండాలని, లేనిచో ఇన్స్పెక్షన్ కమిటీ ఇచ్చే నివేదిక ప్రాతిపదికపై తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ హెల్త్ ప్రొఫైల్స్ కు సంబంధించిన ఫార్మాట్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో రూపొందించి అన్ని సంస్థలు ఒకే విధంగా హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించుటకు సులువుగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని అన్నారు. డిఐవో డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులకు సమాచారం అందించి బాలల సంరక్షణ కేంద్రాల బాల బాలికలకు హెల్త్ ప్రొఫైల్ నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు.కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సందసాని రాజేంద్ర ప్రసాద్, కజాంపురం దామోదర్, బాలరక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, డెమో వి అశోక్ రెడ్డి, డాక్టర్ ఇక్తేదార్ హమీద్ , శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ బి మాధవి, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, సిస్టర్ జెస్సీ సిరియాక్, సోషల్ వర్కర్లు జి సునీత, ఎస్ చైతన్య, ఓఆర్డబ్ల్యు పి విజయ్ కుమార్, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# బరిలో ఎందుకులేరు?

నిజామాబాద్‌డెస్క్/కంఠేశ్వర్/ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధులు/మంచిర్యాల

'ఉపఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అని కేటీఆర్, హరీశ్‌రావు అంటున్నారు. అసలు ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీలో లేరో చెప్పాలి. ఉన్న ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కలలు కంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభుత్వం కూలింది. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున నిలబెట్టేందుకు అభ్యర్థులే కరువయ్యారు. అసలు మీ ఉద్దెర పంచాయితీ ఏంటీ..? ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని అంటున్నారు.. ఎవరికి ఓటు వేయాలని చెప్తారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందమేంటో ప్రజలందరికీ తెలుసు.. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ కుట్రలకు దిగుతున్నారు..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్– ఆదిలాబాద్– నిజామా బాద్– మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాలలో పర్యటించారు. ఆయా సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, విద్యార్థులు ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదేండ్ల కాలంలో వారికి చేసిందేమీ లేదు. పదేండ్ల కాలంలో వారు 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలే. నిరుద్యోగులంతా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ అనాథల లెక్క తిరిగారు. అయినా గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయలే. ఒకవేళ వేసినా.. కోర్టులో వారే కేసులు పెట్టుకుంటూ ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటుండే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలం లోనే 50 వేల ఉద్యోగాలు కల్పించాం. 11 వేల టీచర్ పోస్టులు, 15 వేల పోలీస్ కొలువులు, 6 వేల వైద్య సిబ్బంది నియామకం చేపట్టాం. అనేక డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగాల భర్తీ చేపట్టాం. ఉద్యోగాలు భర్తీ చేసినట్టయితేనే కాంగ్రెస్‌కు ఓటెయ్యండి. లేకుంటే మిగతా వారికి ఓటు వేయండి' అని కోరారు.భావోద్వేగాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని చేసిన పని చెప్పకుండా ప్రజల భావోద్వేగాలు రెచ్చగొట్టి వీధి నాటకాలు ఆడటమే బీజేపీ నాయకుల పని అని సీఎం విమర్శించారు. గుజరాత్ రాష్ట్రంలో 29 శాతం ముస్లింలకు రిజర్వేషన్‌లు అమలు అవుతున్నాయని, అదే విధంగా మధ్రప్రదేశ్, హర్యానా, బీహార్‌లోనూ ముస్లింలకు రిజర్వేషన్‌లు అమలవుతున్నట్టు గుర్తుచేశారు. బీసీల ఆత్మగౌరవం నిలబెట్టాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. బీసీల పట్ల మోడీకి చిత్తశుద్ధి ఉంటే తాము పెట్టిన బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. మోడీ మందకృష్ణ మాదిగను కౌగిలించుకుండు.. ముద్దుపెట్టుకుండు కానీ ఎస్సీ వర్గీకరణ చేయలేదని అన్నారు. 12 ఏండ్లుగా అధికారంలో ఉన్నా.. ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేశామని చెప్పారు.

ప్రభాకర్‌రావును పట్టుకొస్తే 48 గంటల్లో అరెస్ట్

ఫోన్ ట్యాపింగ్ కేసులో అమెరికా పారిపోయిన ప్రభాకర్‌రావును పట్టుకొస్తే 48 గంటల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కానీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజరు.. ప్రభాకర్‌రావును ఇండియాకు రప్పించే అవకాశం ఉన్నా.. బీఆర్ఎస్‌తో ఉన్న లోపాయికారి ఒప్పందంతో తీసుకురావడం లేదని అన్నారు. గొర్రెల స్కాం, ఈకార్ రేసులో ఈడీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని, పెద్దమొత్తంలో విదేశాలకు నగదు పంపిన కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. అమెరికా నుంచి పలువురిని బేడీలు వేసి మరీ పంపిస్తున్నారని, మరి ప్రభాకర్‌రావును ఎప్పుడు తీసుకొస్తావని బండి సంజరుని ప్రశ్నించారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని బరిలో దించలేదన్నారు.

అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి..కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఢిల్లీలో పరిచయాలు ఉన్నాయని, అయినా నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. నిధులు వస్తే ఎక్కడ రేవంత్‌రెడ్డికి పేరు వస్తుందోనని అడ్డుకుంటున్నారని అన్నారు. మెట్రోకు అనుమతి రాకుండా కూడా అడ్డుకుంటున్నారన్నారు. యూపీలో గంగా, ఢిల్లీలో సబర్మతి నదిని ప్రక్షాళన చేస్తున్నారని, మరి హైదరాబాద్‌లోని మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోడీ అన్నారని, కానీ ఇందులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిందేమీ లేదన్నారు. నిరుద్యోగుల ను మోసం చేశారని, కిషన్‌రెడ్డి, బండి సంజరుకి మాత్రం రెండు ఉద్యోగాలు వచ్చాయని అన్నారు.

పదేండ్లలో రాని ఉప ఎన్నిక ఇప్పుడెందుకు వస్తది..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో రాని ఉప ఎన్నిక ఇప్పుడు ఎందుకు వస్తదని సీఎం ప్రశ్నించారు. గతంలో ఉన్న కోర్టులే ఇప్పుడూ ఉన్నాయని, గతంలో ఉన్నట్టే స్పీకర్ ఇప్పుడూ ఉన్నారని తెలిపారు. అటు మోడీతో ఇటు కేసీఆర్‌తో కొట్లాడుతున్నానని, తమకు మనోధైర్యం పెరగాలి అంటే అండగా నిలబడాలని కోరారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించినట్టు చెప్పట్లేదని, కానీ పరిష్కరించే అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిపారు.

## దేశానికి అన్నం పెట్టే రైతన్నతో కన్నీళ్లు పెట్టిస్తున్నారు.. కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు.బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతన్నను నట్టేట ముంచి, నడి రోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంట నీరు పెట్టిస్తున్నరని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి.. గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సిద్ధమైన సీఎం: కేటీఆర్

హైదరాబాద్: రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు.. ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి, గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (%ఖు=%) విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది ఆచూకీ తెలియని ఈ విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలడం దిగజారుడు రాజకీయమేనని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికే జరిగిన ఘోర దుర్ఘటనపై సీరియస్‌నెస్ లేకపోతే, ఇక అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటది, రెస్క్యూ ఆపరేషన్ ఎలా ముందుకు సాగుతదని ప్రశ్నించారు.

ఓట్ల వేటలో జిల్లాలకు జిల్లాలు చుట్టి



వచ్చేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉంది కానీ.. ఒక్కసారి క్షతగాత్రుల ఆర్తనాదాలతో మిన్నంటుతున్న ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు వెళ్లే టైమ్ లేదా అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా అంటూ ధ్వజమెత్తారు. ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేట మాత్రమేనా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓవైపు సహాయక చర్యలు కొలిక్కి రాకముందే, ఇరుక్కున్న వారు బతికుండే అవకాశం కనిపించడం లేదని సర్కారు చేతులెత్తేస్తున్న తీరు, మరోవైపు సహాయక చర్యలను పర్యవేక్షించి, బాధితుల కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మరిచి ఎన్నికలే మా తొలి ఎజెండా అనే ముఖ్యమంత్రి, సర్కారుకు కనీస మానవత్వం కూడా లేదా అన్నారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు, ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి గ్రాడ్యుయేట్స్ కు గాలం వేసేందుకు సిద్ధమైన సీఎంను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాత పెట్టారని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు..

# ఆక్వా ఐ పరికరాలతో సెర్చింగ్

మహబూబ్ నగర్: నాగర్‌కర్నూల జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై విమర్శలు వస్తుండటంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం మేల్కొంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఇదే తరహాలో 2023లో ఉత్తరాఖండ్‌లో జరిగిన ప్రమాదంలో 34 మందిని రక్షించిన మద్రాస్ ఐఐటీ నిపుణులను రంగంలోకి దించింది. అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఆక్వా ఐ, ఫ్లెక్సీ ప్రొబ్ పరికరాలతో మద్రాస్ ఐఐటీ నిపుణులు సహాయక చర్యలు కొనసాగించనున్నారు. మరోవైపు వైజాగ్‌కు చెందిన నేవీ బృందం కూడా రంగంలోకి దిగడంతో పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులను రక్షించేందుకు మూడో రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే పెద్ద ఎత్తున ఊటనీరు ఉబికి వస్తుండటంతో నీరు బురదతో కలిసి పెద్ద ఎత్తున బయటకొస్తుంది. దీంతో ఆదివారం నాడు 13 కిలోమీటర్ల లోపలికి చేరుకున్న రెస్క్యూ బృందం.. సోమవారం నాడు 11 కిలోమీటర్ల వరకు మాత్రమే వెళ్లగలిగింది. అక్కడి నుంచి బురద నీరు పెద్ద మొత్తంలో వస్తుండటంతో సహాయక చర్యలు చేపట్టడానికి వీలు కావడం లేదు. 24 గంటల్లోనే నీటి ధారలు ఎక్కువ కావడాన్ని గుర్తించారు. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఫలితంగా లోపలికి రెస్క్యూ బృందం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటినీ అధిగమించేందుకు మద్రాస్ ఐఐటీ నిపుణులు తీసుకువచ్చిన కొత్త పరికరాలపైనే ఆశలు నెలకొన్నాయి. వీరితో పాటు ఆర్మీ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌తో పాటు మిగతా బృందాలు నిర్విరామంగా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. డిజాస్టర్ మేనేజ్మెంట్ చీఫ్ కమిషనర్ అరవింద్ కుమార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, నాగర్ కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ నిపుణులతో చర్చించి ఎప్పటికప్పుడు సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపల చిక్కుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో బయటికి తీసుకొస్తామని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించారు.

ఆక్వా ఐ.. ఫ్లెక్సీ ప్రొబ్ పరికరాల మీదే ఆశలు..

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అత్యాధునిక పరికరాలను వాడుతున్నారు. మద్రాస్ ఐఐటీకి చెందిన సాంకేతిక నిపుణుల సహకారంతో లోపల చిక్కుకున్న వారిని గుర్తించి రెస్క్యూ చేయనున్నారు. ఐఐటీ నిపుణులు ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఆక్వా ఐ కెమెరా హై రిజల్యూషన్ ది. ఇది నీటిలో సుమారు 50 మీటర్ల చుట్టుపక్కల ఉన్న వాటిని గుర్తిస్తుంది. బురద ఇతర ఏమున్నప్పటికీ కూడా గుర్తించి రికార్డింగ్ చేస్తుంది. ఈ కెమెరా వల్ల లోపల చిక్కుకున్న వారి పరిస్థితిని గమనించనున్నారు. గతంలో చాలా చోట్ల ఇలాంటి టెక్నాలజీనే వాడారు. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కూడా ఇలాంటి టెక్నాలజీ ఉపయోగించి రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన ప్రమాదంలో ఇదే టీం దాదాపు 34 మందిని రక్షించింది. ఇదే టెక్నాలజీ ద్వారా సహాయక చర్యలు వేగవంతం చేయాలని భావిస్తున్నారు. ఈ కెమెరా లోపలికి పంపించి ఆ చిత్రాల ఆధారంగా ఏం చేయాలని దానిపై నిపుణులు ఇచ్చిన సూచనలను పాటించి రెస్క్యూ చేసే అవకాశం ఉంది. మరోవైపు హై రిజల్యూషన్ కలిగిన కెమెరాలను కూడా పంపిస్తున్నారు. ఈ కెమెరాలు లోపల ఉన్న ప్రతి అంగుళాన్ని కూడా చిత్రీకరించి బయట ఉన్న వారికి లైవ్ గా అందిస్తోంది. మరోవైపు ఎనిమిది మందిని చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక జాగిలాలను కూడా రంగంలో దించారు.

## వాళ్లకు మానవత్వం లేదు
## విపక్షాలపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

సహాయ చర్యలు జరుగుతున్న తీరుపై అధికారులతో చర్చించారు. అనంతరం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలకు మానవత్వం లేదని.. ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నిరంతరం అక్కడ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తూఫ్రాన్ రైలు ప్రమాదంలో స్కూల్ విద్యార్థులు చనిపోతే కేసీఆర్ కనీసం వెళ్లి పరమర్శించలేదని విమర్శించారు. " మీరు చేయని పనులు మేము చేస్తున్నాం" అని.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్నవారికి మనోధైర్యం ఇవ్వాలని, సురక్షితంగా తీసుకురావడానికి సలహాలు ఇవ్వాలన్నారు. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదని.. అందరినీ బయటకు తెచ్చిన తర్వాత మళ్లీ పనులు మొదలు పెడతామని.. ఆ తర్వాత బీఆర్ఎస్ వాళ్ల సంగతి చెబుతామన్నారు.ఇది బీఆర్ఎస్ నిర్లక్ష్యం

గత ప్రభుత్వం (బీఆర్ఎస్) ఎస్ఎల్‌బీసీని నిర్లక్ష్యం చేసిందని, మేము దాన్ని పూర్తి చేయాలని భావిస్తే ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అందులో చిక్కుకున్న 8 మంది క్షేమంగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు. సొరంగం గురించి, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. పదేళ్లు సొరంగాన్ని ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని.. కాళేశ్వరంలో చిన్న చిన్న సొరంగం పనులకు ఎంతో మంది చనిపోయారని, కాళేశ్వరంలో చనిపోతే బీఆర్ఎస్ నేతలు ఏమైనా సహాయ చర్యలు చేపట్టారా? అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## పీఎం కిసాన్ నిధులు
## విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

19వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ


9.7 కోట్ల మంది రైతులకు రూ.22 వేల కోట్లను విడుదల చేసిన కేంద్రం

ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.6 వేలు

రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం–కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద 19వ విడత నిధులను ఈరోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు.

బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా రూ.22 వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో విడత రూ.2 వేల చొప్పున ఏడాదికి మూడు విడతలు మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

## ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడో స్థానం వస్తుంది: బండి సంజయ్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని జోస్యం

ఓడినా, గెలిచినా పోయేదేమి లేనప్పుడు ప్రచారానికి ఎందుకొచ్చారని ప్రశ్న

గత ప్రభుత్వం కుంభకోణాల కేసులను సీబీఐకి అప్పగించాలని డిమాండ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మూడో స్థానమే వస్తుందని సర్వేలన్నీ తేల్చేశాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని ఆయన జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ఆయన అన్నారు.ఎన్నికల్లో ఓడినా, గెలిచినా పోయేదేమీ లేదని ముఖ్యమంత్రి అంటున్నారని, అలాంటప్పుడు ఆయన ప్రచారానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు.గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై మీరు విచారణ జరుపుతూ, కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీకి చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వ కుంభకోణాలను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అప్పుడు దోషులను లోపల వేస్తామని తేల్చి చెప్పారు.

## ఖాళీ స్థలాలకు పన్నులు విధించండి.



కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 24

నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలకు పన్నులు విధించాలని, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని 43, 44 వార్డులలో కార్పొరేటర్ నారాయణ, హెల్త్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పారిశుద్ధ్య పనులను,ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ఖాళీ స్థలాలలో అపరిశుభ్రంగా ఉండటం పట్ల ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు ఆ స్థలాలను పరిశీలించి పన్నులు వేసి పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పలుచోట్ల డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే ఆగిపోవడం వలన దోమలు పెరిగి ఇబ్బందులు వస్తున్నాయని వెంటనే వాటిని శుభ్రం చేయాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. అలాగే మరమ్మతులకు గురైన డ్రైనేజీ కాలువలను సరి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ మరింత పక్కాగా చేపట్టాలని తెలిపారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. రమణ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

## మహిళ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



కుప్పం ఫిబ్రవరి 24 పత్రిక )

కుప్పం పురపాలక సంఘం పరమ సముద్రంలోని కస్తూర్బా (కేజీవీబీ ) పాఠశాలలో స్కిల్ ఇన్స్ట్రక్టర్ కల్పన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం గుండ్ల సాగరం గ్రామానికి చెందిన కల్పనా దాదాపు పదేళ్లగా ఈ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆమె ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమెను స్థానికులు గమనించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేర్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి వేధింపుల కారణంగానే చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు బాధితురాలు కల్పన ఆరోపించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, ఎస్సై బాబు తెలిపారు.

# బీసీ రుణమేళా కు... ఆర్హులైన అభ్యర్థుల ధరఖాస్తుల పరిశీలన..

నంద్యాల జిల్లా బ్యూరో:-ఫిబ్రవరి 24 (నంది పత్రిక)

నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నందు సోమవారం ఉదయం 10గంటల నుండి మెప్మా జిల్లా అధికారి డి. వెంకటదాస్ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకర్స్ తో కలిసి బీసీ రుణమేళా నిర్వహించి అందులో అభ్యర్థుల ధరఖాస్తులను పరిశీలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన బీసీ రుణాలకు సంబంధించి ఆన్లైన్లో లబ్దిదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ఈ మేరకు నంద్యాల మున్సిపాలిటీ పరిదిలో 3274 ధరఖాస్తులు రావడం జరిగిందని మెప్మా జిల్లా అధికారివెంటదాస్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మెప్మా జిల్లా అధికారి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన, బలహీన వర్గాల వారికి ఆర్థిక సహకారం అందించేందుకు వివిధ వ్యాపారు చేసుకోవడానికి రుణాలను అందించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి ఎంత మంది లబ్ధిదారులకు రుణాలను నుంజూరు చేస్తారు. సమగ్రం చర్చించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 3274 ధరఖాస్తులను వార్డుల వారిగా 8వార్డులకు ఒక టేబుల్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారుల సమక్షంలో, బ్యాంకర్లు ఆర్హులైన వారి ధరఖాస్తులను పరిశీలించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఆర్హులైన వారి జాబితాను ఉన్నత అధికారులకు నివేదిక సమర్పించడం జరుగుతుందని, త్వరలో అర్హులైన వారికి బ్యాంక్ నుండి రుణాల మంజూరు కార్యక్రమం చేపడతామని తెలిపారు.



# ఘనంగా బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం,





## ఓలింగ... ఓలింగ అంటూ గంపలతో బైలెల్లిన యాదవులు.

ఘనంగా లింగమంతుల జాతర.

కేసముద్రం, ఫిబ్రవరి 24(నంది పత్రిక): సోమవారం కల్వల గ్రామంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి గ్రామ ప్రజలచే జలాభిషేకాలు, 7 గంటలకు గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్థలశుద్ధి, బొడ్రాయికి జల, పంచామృతాభిషేకాలు, మండల పూజ మూల మంత్రములు, 10 గంటలకు హోమములు, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, బలి ప్రధానం, కుంభోషేకం, పంచ భోజనము, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ చేసి, సాయంత్రం 4 గంటలకు అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. అలాగే యాదవ సంఘం ఆధ్వర్యంలో లింగమంతుల జాతర ఘనంగా నిర్వహించారు. ఇంతకుముందు యాదవులందరూ లింగమంతుల జాతర సందర్భంగా సూర్యాపేట జిల్లాలో పెద్దగట్టుకు తరలి వెళ్లేవారు. ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలోని యాదవుల ఆధ్వర్యంలో గ్రామంలోనే లింగమంతుల స్వామికి గుడి నిర్మించుకొని, గ్రామంలోనే జాతర నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతరకు ప్రతి యాదవ కుటుంబం నుండి గంపలతో బయలుదేరి ఓలింగ.... ఓలింగ... అంటూ శివసత్తుల పూనకాలతో నృత్యాలు చేసుకుంటూ డబ్బు సప్పులతో గుడి వద్దకు చేరుకొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.



# సమగ్ర కుటుంబ సర్వే ఉద్యోగులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికం వెంటనే చెల్లించాలి.







కేసముద్రం, ఫిబ్రవరి 24(నంది పత్రిక): 2024 నవంబర్ నెలలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహించిన ఎన్యూమరేటర్లకు, డేటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లకు ఇవ్వవలసిన పారితోషికం వెంటనే ఇవ్వాలని కోరుతూ సోమవారం కేసముద్రం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జె క్రాంతికి వినతి పత్రం అందజేశారు. విధులు నిర్వహించి మూడు నెలలు గడిచినా ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదని, సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకుని విధులు నిర్వహించిన ఉద్యోగులందరికీ, డేటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లందరికీ డబ్బులు వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్, వెన్ను బిక్షపతి, పత్తిపాక ఉపేందర్, వి వెంకటరమణ, చీర మురళి, బండారు స్వాతి, నేలకొండ నాగవాణి, బానోత్ దేవుసింగ్, ఏ ప్రణీత, ఎస్ అనిత, నేరెళ్ల పద్మ, జి రేవంత్, జి రాజు, జి జస్వంత్, షేక్ అజిత్ లు పాల్గొన్నారు.

# ఆవిర్భావ దినోత్సవ వేళ.. పలువురు నేతలకు కీలక బాధ్యతలు

**అమరావతి, ఫిబ్రవరి 24 :** గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలో నిలిపిన 21 మంది అభ్యర్థులు ఘన విజయం సాధించారు. చంద్రబాబు సారథ్యంలో కొలువు తీరిన ప్రభుత్వంలో ఆ పార్టీ కీలక భాగస్వామి అయింది. అలాంటి వేళ.. మార్చి 14వ తేదీన పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాని స్థానిక ఎమ్మెల్యే, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయించారు. అందులోభాగంగా ఈ వేడుకలకు పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్తలు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియమించారు. అందుకోసం.. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను ఆయన నియామించారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జులు, పీ.ఓ.సీలు, మండలాధ్యక్షులతో సమావేశాలు నిర్వహించి.. పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసేలా కీలక బాధ్యతలు అప్పగించారు.



**పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్తలు**

శ్రీకాకుళం: కొరికన రవి కుమార్
విజయనగరం: లోకం నాగ మాధవి
విశాఖపట్నం: సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్
అనకాపల్లి: పంచకర్ల రమేశ్ బాబు
అరకు: వంపూరు గంగులయ్య
కాకినాడ: తుమ్మల రామస్వామి
రాజమండ్రి: యర్నాగుల శ్రీనివాసరావు
అమలాపురం: బండారు శ్రీనివాసరావు
నరసాపురం: కొటికలపూడి గోవిందరావు
ఏలూరు: రెడ్డి అప్పల్నాయుడు
మచిలీపట్నం: బండి రామకృష్ణ
విజయవాడ: సామినేని ఉదయభాను
గుంటూరు: గాదె వెంకటేశ్వర రావు
బాపట్ల: వఁడ్రాణమ్ మార్కండేయబాబు
నరసరావుపేట: కిలారు రోశయ్య
ఒంగోలు: షేక్ రియాజ్
నెల్లూరు: వేములపాటి అజయ కుమార్
కడప: తాతంశెట్టి నాగేంద్ర
రాజంపేట: అతికారి కృష్ణ
కర్నూలు: చింతా సురేష్
నంద్యాల: నయుబ్ కమల్
అనంతపురం: టి.సి.వరుణ్
హిందూపురం: చిలకం మధుసూదన్ రెడ్డి
చిత్తూరు: డా.పసుపులేటి హరిప్రసాద్
తిరుపతి: ఆరణి శ్రీనివాసులు

# జగన్‌పై బీటెక్ రవి హాట్ కామెంట్స్



**కడప ఫిబ్రవరి 24 :** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బీటెక్ రవి హాట్ కామెంట్స్ చేశారు. జగన్ రెడ్డి అనే ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళ్లడం కూడా ఒక చర్చనా.. అసెంబ్లీకి కేవలం సంతకం కోసం మాత్రమే వెళ్లారని చెప్పారు. రఘురామ కృష్ణమరాజు విషయంపై ఎప్పుడైతే చర్చించాడో అప్పుడే పదిమంది ఎమ్మెల్యేలకు భయం పుట్టిందని అన్నారు. ఏపీ సమస్యలు, పులివెందుల సమస్యలను అసెంబ్లీలో జగన్ వినిపిస్తే బాగుంటుందని తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో జగన్ అసెంబ్లీని బాయికాట్ చేశారని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, జైపాల్ రెడ్డి, ఇలాంటి వారు ఒక సీటు రెండు సీట్లతోనే అసెంబ్లీలో తమ గొంతును వినిపించారని బీటెక్ రవి గుర్తుచేశారు. బై ఎలక్షన్లకు తాము సిద్ధమే దమ్మొంటే 11 మందిని రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఉప ఎన్నికల్లో పులివెందులలో కూడా జగన్మోహన్ రెడ్డి గెలవలేరని చెప్పారు. ఎంపీ అవినాష్ రెడ్డి జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్తే సినిమా చూపిస్తారనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వివేకం సినిమా చూశాం వివేకం టు ఏమన్నా చూపిస్తారా అని వ్యంగ్యంగా బీటెక్ రవి ప్రశ్నించారు. వైఎస్ కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఎంపీగా అవినాష్ రెడ్డి గెలిచారంటే సునీత, షర్మిల ఫొటోలు ఇంట్లో ఉంచుకోవాలి లేకుంటే ఎంపీ పదవి కూడా దక్కేది కాదని చెప్పారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు దద్దమ్మ కబుర్లు చెబుతున్నారో తెలుస్తాయని బీటెక్ రవి అన్నారు.

## ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి రాజీనామా

**అమరావతి, ఫిబ్రవరి 24:** ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి తన పదవీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు జీవీ రెడ్డి ప్రకటించారు. టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా జీవీరెడ్డి రాజీనామా చేశారు. ఇటీవల ఫైబర్ నెట్ ఎండీపై జీవీ రెడ్డి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈవివాదం నేపథ్యంలో జీవీ రెడ్డి రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫైబర్ నెట్‌లో ఉద్యోగుల తొలగింపు, జీఎస్టీ చెల్లింపుల వంటి అంశాలపై మూడు రోజుల క్రితం అధికారులపై జీవీ రెడ్డి ఆరోపణలు చేశారు. వైసీపీకి సానుభూతిపరులు అయిన ఉద్యోగులను జీవీ రెడ్డి తొలగించినప్పటికీ ఫైబర్ నెట్ ఎండీ ఆమోదం తెలపలేదని జీవీ రెడ్డి చెప్పారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లి జీవీ రెడ్డి వివరణ ఇచ్చారు. అధికారులతో కలిసి పని చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆరోపణలు చేసిన అధికారులతో కలిసి పని చేయడం ఇష్టం లేకపోవడంతోనే రాజీనామా చేశానని జీవీ రెడ్డి తెలిపారు.




## ఆయన నాయకత్వం చాలా అవసరం.. పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు



**అమరావతి, ఫిబ్రవరి 24** లీ క్వాన్ యూ దూరదృష్టి, నాయకత్వం, సంకల్పానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశంసించారు. సింగపూర్, ఆంధ్రప్రదేశ్ మధ్య భాగస్వామ్య పురోగతి భవిష్యత్తును నిర్మించడానికి మా సంబంధాలను బలోపేతం చేయడానికి ఎదురు చూస్తున్నామని అన్నారు. "ఒక వ్యక్తి ధైర్యం మెజార్టీ కలిగిస్తుంది" లీ క్వాన్ యూ దీనికి పరిపూర్ణ చిహ్నం, సంపూర్ణ సంకల్పం, నాయకత్వం ద్వారా దేశం ఆకాంక్షలను వాస్తవంగా మారుస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. సింగపూర్ సాధారణ మత్స్యకార గ్రామం నుంచి గ్లోబల్ పవర్‌హౌస్‌కు ప్రయాణించడం గొప్ప అని కొనియాడారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. లీ క్వాన్ యూ దూరదృష్టి, నాయకత్వం, సంకల్పానికి నిదర్శనమని ప్రశంసించారు. హార్డ్ ట్రూత్స్ మరియు వన్ మ్యాన్స్ వ్యూ ఆఫ్ ది వరల్డ్ అనే ఆలోచనాత్మక బహుమతి కోసం రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ కాన్సులేట్ జనరల్ మిస్టర్ ఎడ్గార్ పాంగ్ మరియు కాన్సుల్ శ్రీమతి వైష్ణవికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అమూల్యమైన పుస్తకాలు పాలన, నాయకత్వం గురించి లోతైన అంతర్దృష్టులను అందిస్తాయని చెప్పుకొచ్చారు. సింగపూర్, ఆంధ్రప్రదేశ్ మధ్య భాగస్వామ్య పురోగతి భవిష్యత్తును నిర్మించడానికి మా సంబంధాలను బలోపేతం చేయడానికి ఎదురు చూస్తున్నామని అన్నారు. ఇది భారతదేశ సంబంధాన్ని బలోపేతం చేస్తుందని పవన్ కల్యాణ్ తెలిపారు.

# మిర్చి రైతులకు కేంద్రం గుడ్ న్యూస్





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 :** మిర్చి రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. భారత ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం (MIS) ద్వారా మిర్చి క్వింటాకు రూ.11,781 మద్దతు ధరగా కేంద్రం నిర్ణయించిందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అందులో 25% ఉత్పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. అవసరమైతే ఎంఐఎస్ పెంపునకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. మిర్చి రైతులకు ఇది కేవలం ఊరట మాత్రమే కాదని.. బలమైన అండ అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో మిర్చి కనీస మద్దతు ధర రూ. 7 వేలుగా నిర్ణయించింది. అయితే ఇటీవల మిర్చి రైతులకు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ నేపథ్యంలో వారు తీవ్ర ఆందోళన చెందుతోన్నారు. అలాంటి వేళ గుంటూరులోని మిర్చి యార్డ్‌లో ఆ పంట రైతులను పరామర్శించాలని వైసీపీ అధినేత, ఎమ్మెల్యే వైఎస్ జగన్ నిర్ణయించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతోన్న వేళ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని పోలీసులు వైఎస్ జగన్‌కు స్పష్టం చేశారు. మిర్చి రైతు పరామర్శకు వెళ్ల వద్దంటూ ఆయనకు సూచించారు. కానీ పోలీసుల ఆదేశాలను పక్కన పెట్టి.. వైఎస్ జగన్ మిర్చి యార్డ్‌లో రైతులను పరామర్శించారు. మరోవైపు అదే సమయంలో మిర్చి రైతుల సమస్యలపై ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఉన్నతాధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆ శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మిర్చి రైతుల వేతలపై చర్చించారు. అలాగే సీఎం చంద్రబాబు తీసుకు వెళ్లిన సమస్యలను సైతం ఈ భేటీలో ప్రస్తావించారు. దీంతో మిర్చి రైతులకు శుభావర్త అందింది. ఇక ఇదే విషయాన్ని కేంద్రంతో చర్చించి.. మిర్చి రైతులకు మేలు జరిగేలా కృషి చేయాలంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. దీంతో పెమ్మసాని చంద్రశేఖర్ రంగంలోకి దిగారు. ఆ క్రమంలో మిర్చి రైతులను ఆదుకొనేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.

# వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా కన్నబాబు

**-పార్టీ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 24 :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో కొనసాగిన విజయసాయిరెడ్డి ఇటీవల వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో పార్టీ అధిష్ఠానం కన్నబాబును నియమించిన విషయం తెలిసిందే. కాగా ఊరేగింపుగా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న కన్నబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పండుల రవీంద్రబాబు, అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎనిమిది నెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల్లో పరపతిని కోల్పోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని జిల్లాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల కంటే వైసీపీ బలంగా ఉందన్నారు. ఒక్క గ్యాస్ మినహా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏదీ



అమలుచేయలేదన్నారు. అయినప్పటికీ రూ.1.2 లక్షల కోట్లు అప్పుచేశారని ఎద్దేవా చేశారు.

# వంశీకి ఇక దబిడి దిబిడే..

**అమరావతి, ఫిబ్రవరి 24 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వల్లభనేని వంశీ అక్రమాలపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అతని అక్రమాలపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది. వంశీ అరాచకాలు, అక్రమాలపై విచారణ కోసం నలుగురు విచారణాధికారులతో కూడిన సిట్ ఏర్పాటు చేసింది. ఈ సిట్‌కు జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వం వహించనున్నారు. వల్లభనేని వంశీ అక్రమ మైనింగ్ సహా భూ కబ్జాలపై సిట్ దర్యాప్తు చేయనుంది.



## మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



**హైదరాబాద్, ఫిబ్రవరి, 24,** మేడిగడ్డ కుంగిన వ్యవహారంలో కేసీఆర్, హరీశ్ రావుకు జిల్లా కోర్టు నోటీసులు జిల్లా కోర్టు నోటీసులపై హైకోర్టుకు వెల్లిన కేసీఆర్, హరీశ్ రావు ఇరువైపుల వాదనలు పూర్తి కావడంతో తీర్పు రిజర్వ్ మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరిస్తూ జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసింది. జిల్లా కోర్టు నోటీసులపై కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల పిటిషన్‌దారు రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. ఫిర్యాదుదారు మృతి చెందితే పిటిషన్‌కు విచారణార్హత ఏ విధంగా ఉంటుందని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా పిటిషన్‌ను విచారించవచ్చని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ క్రమంలో, ఇరువైపుల వాదనలను విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

## ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి

**-రిటర్నింగ్ అధికారి ,కలెక్టర్ పమేలా సత్పతి.**

**కరీంనగర్, ఫిబ్రవరి, 24** ఈ నెల 27న జరిగే మెదక్ -నిజామాబాదు -కరీంనగర్ -ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్ )అమలులో ఉంటుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి నేడొక ప్రకటన లో తెలిపారు. సైలెన్స్ పీరియడ్ లో భాగంగా 25.02.2025 సాయంత్రం 4.00 గంటల నుండి 27.02.2025 సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సైలెన్స్ పిరియడ్ లో ఎవరు కూడా రాజకీయపరమైన ఎస్.ఎం.ఎస్ లు, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపకూడదని, బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించకూడదని, ప్రచారం చేయరాదని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సైలెన్స్ పీరియడ్ లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు,ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టి, ఎస్ ఎస్ టి, ఎంసీసీ, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కళ్యాణ మండపాలు, హొటళ్లు, లాడ్జింగ్ ల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కాగా, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126(1)(బి) ఆర్పీ యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ తెలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు నిర్వహించే ఆయా జిల్లాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని, రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ అట్టి ప్రకటన లో వెల్లడించారు.

## ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి





**-కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఫిబ్రవరి, 24** రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఎండల తీవ్రత, జాగ్రత్త చర్యలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో నీటిని కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువసార్లు నీళ్లు తాగేలా చూడాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని అన్నారు. వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి నిమ్మరసం అందించాల్సిందిగా నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేయాల్సి వస్తే ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే నిలిపివేయాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. వేసవిలో మొక్కలకు మల్చింగ్ చేసి సంరక్షించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రజలు ఏమి చేయాలో ఏమి చేయకూడదో సూచించే పోస్టర్లను జన సందోహం ఉండే ప్రాంతాల్లో అతికించాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కిట్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎండ తీవ్రత కారణంగా మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడితే 108కి కాల్ చేయాలన్నారు. ప్రజలు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, మసాలా పదార్థాలు తగ్గించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి





**కరీంనగర్, ఫిబ్రవరి, 24** వీడియో కాన్ఫరెన్స్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి మెదక్ -నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సహా 15 జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సోమవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుండి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్ ఎన్నికల పరిశీలకులు బుద్ధ ప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ఉన్న అన్ని జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పోలింగ్ ప్రక్రియ మొదలు... తుది ఫలితాలు వెల్లడి వరకు అందుబాటులో ఉంటూ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్ రోజున అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ హాజరు అయిన రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆయన దృష్టికి పలు వివరాలు తీసుకుని వచ్చారు. 15 జిల్లాల పరిధిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సుల రిసెప్షన్ కేంద్రం కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేశామని అన్నారు. అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ కి పంపించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా పోలైన ఓట్ల బ్యాలెట్ బాక్సులను కూడా కరీంనగర్ లోని కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని అన్నారు. జిల్లాల వారీగా, గ్రాడ్యుయేట్, టీచర్స్ వారీగా కౌంటర్లు ఏర్పాటు చేస్తామని, బ్యాలెట్ బాక్సులు సంబంధిత కౌంటర్లలో స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ కి సీసీ కెమెరా, వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. వెబ్ కాస్టింగ్ లో సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో కౌంటింగ్ సెంటర్ సిద్ధం చేశామని, సుమారు 23 టేబుల్ లలో గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం ప్రత్యేక బాక్సులను తయారు చేయించామని, ఇదివరకే రెండు దఫాలుగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని అన్నారు. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నందు అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయి, లక్ష్మి కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డిఓ మహేశ్వర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల రోజున ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించిన కలెక్టర్

**కరీంనగర్, ఫిబ్రవరి, 24** ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు వెసులుబాటు ఈనెల 27న జరిగే మెదక్ -నిజామాబాద్ -కరీంనగర్ -ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు. ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు షిఫ్టుల సర్దుబాటు, డ్యూటీ గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరుకావడానికి అనుమతి వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రత్యేక సాధారణ సెలవు, వెసులుబాట్లను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.



# మట్టి లేకుండా వ్యవసాయం.. అదెలాగంటే..?












హైడ్రోపోనిక్ విధానం అంటే మట్టితో పని లేకుండా వ్యవసాయం చేయడం. అంటే మట్టి నుంచి మొక్కకు చాలా రకాలైన పోషకాలు అందుతాయి కదా.. వాటిని హైడ్రోపోనిక్ విధానంలో నీటి ద్వారా అందిస్తారు. ఒకప్పుడు వ్యవసాయం అంటే పొలం ఉండాలి.. ఆ పొలంలో సాగుకు అవసరమైన నీటి సౌలభ్యం ఉండాలి. ఇలా ఎన్నో రకాల వసతులు ఉండాలి. కానీ, నేడు పరిస్థితులు మారిపోయాయి. సాగు కోసం పొలం బాట పట్టాల్సిన అవసరం లేదు. మరీ ఆసక్తికర విషయం ఏంటంటే.. కనీసం భూమి కూడా అవసరం లేదు. భూమి లేకుండా వ్యవసాయమా..? తెలియని వారైతే ముక్కున వేలేసుకుంటారు. గతంలో మాదిరిగా లేదు పరిస్థితి. మనం తినే ఆహారమంతా కలుషితమే. జనాలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో మన ఆహారానికి అవసరమైన కూరగాయలను మన ఇంట్లోనే పండించుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకు ప్రతిరూపమే హైడ్రోపోనిక్ ఫార్మింగ్. గజం స్థలం దొరకడమే గగనమవుతున్న ఈ రోజుల్లో హైడ్రోపోనిక్ వ్యవసాయం అందరినీ ఆకట్టుకుంటోంది. దీనికోసం భూమి అవసరం లేదు. ఎక్కడికో వెళ్లాల్సిన పని అంతకన్నా లేదు. మన ఇంట్లో లేదా బాల్కనిలోనే వ్యవసాయం చేసుకోవచ్చు. తొలుత తమ అవసరాల కోసం ప్రారంభించిన ఈ వ్యవసాయం ఇప్పుడు జీవనాధారంగా కూడా మారుతోంది. అసలు ఈ హైడ్రో పోనిక్ విధానంలో వ్యవసాయం ఎలా చేయాలి..? దీనికి ఎంత స్థలం ఉండాలి..? ఎలాంటి పంటను పండిస్తే ఎక్కువ లాభాలు వస్తాయి..? వంటి అంశాలపై ఒకసారి చర్చిద్దాం. తేమ నుంచి నీటిని ఉత్పత్తి చేసే యూనిట్స్ హైడ్రోపోనిక్ విధానం అంటే మట్టితో పని లేకుండా వ్యవసాయం చేయడం. అంటే మట్టి నుంచి మొక్కకు చాలా రకాలైన పోషకాలు అందుతాయి కదా.. వాటిని హైడ్రోపోనిక్ విధానంలో నీటి ద్వారా అందిస్తారు. ఈ విధానంలో మొక్క పెరగడానికి మట్టిని బదులు కొబ్బరి పీచును ఉపయోగిస్తారు. తక్కువ స్థలంలో ఎక్కువ పంటను పండించవచ్చు. పాలిహౌస్‌ల గురించి పట్టణాలు, నగరాల్లో నివసించే వారికి బాగానే అవగాహన ఉంటుంది. దాని కన్నా ఇది అధునాత విధానం. ఈ విధానంలో కొన్ని రకాల పూలు, పండ్లు, కూరగాయలు పండిస్తున్నారు. పంటల ఉత్పత్తికి ఇది ప్రత్యామ్నాయ మార్గం. చౌడు నేలలు, వ్యవసాయానికి అనుకూలంగా లేని ప్రదేశాలలో ఈ విధానం అవలంబించవచ్చు. మొక్క స్థిరత్వానికి మట్టికి బదులు జడపదార్థాన్ని వినియోగిస్తారు. మరి ఈ జడ పదార్థంగా దేనిని ఉపయోగిస్తారనే కదా మీ డౌట్..? పంట రకాన్ని బట్టి రాక్ పూల్, పెర్లైట్, వెర్మికులైట్, ఇసుకలను వినియోగిస్తారు. గాలితో పాటు వెలుతురు, పంట రకాన్ని పరిగణలోకి తీసుకుని అవసరమైన మోతాదు మేరకు కృత్రిమంగా అందించడం జరుగుతుంది. హైడ్రోపోనిక్ విధానం వల్ల లాభాలేంటంటే.. ? నీటి వినియోగం చాలా తక్కువ.. ? అధిక దిగుబడి అధికం. ? ఎడారి ప్రాంతాల్లోనూ పంటలు పండించవచ్చు. ? కలుపు బాధ ఉండనే ఉండదు. చీడ పీడలు దరిచేరవు. ? ఆకుకూరలు ఈ విధానంలో త్వరగా పెంచవచ్చు. నష్టాలు.. ? పరికరాలు చాలా ఖరీదు ఉంటాయి. ? సాంకేతిక నిపుణుల అవసరం ఉంటుంది. ? అన్ని రకాల పంటలకూ ఇది అనుకూలం కాదు. ? విద్యుత్ వినియోగం ఎక్కువ. ? నీటిలో ఉండే సూక్ష్మజీవులు మొక్కల పైకి పాకే అవకాశం.

# వ్యవసాయ పనులు



వ్యవసాయానికి సిద్ధం చేస్తున్న పొలంలో చిత్రాలు

**దుక్కి దున్నడం:**
పంటపండించే ముందు, సరైన కాలంలో దుక్కి దున్నడం, మొట్టమొదటి సారిగా చేసే వ్యసాయపు సాగు పని. దీనివల్ల అనేక లాభాలున్నాయి. నేలను దున్నడం వల్ల నేల గుల్లబారి, మెత్తగా ఉంటుంది. అటువంటి నేలలోకి నీరు పారిస్తే భూమిలోకి ఇంకి, అన్ని వైపులకూ ప్రవహిస్తుంది. నేల మెత్తగా ఉంటే దాని ఉపరితల వైశాల్యం పెరిగి ఆ నేలలో ఎక్కువ నీటి నిలుపుదలకు సహాయపడుతుంది. ఈ నీటిని మెక్కలు పీల్చుకుంటాయి. దుక్కి దున్నడానికి నాగలిని విరివిగా ఉపయోగిస్తారు.

**భూమిని చదునుచేయడం:**
పొలంలోని మట్టిగడ్డల వలన నేల ఎగుడుదిగుడుగా ఉంటుంది. దానివల్ల ఆనేలలో విత్తనాలు జల్లడానికి, నారు మొక్కలు వేయడానికి అనువుగా ఉండదు. నేలను చదును చేయడం వల్ల నీరు, పోషక పదార్థాలు సమానంగా సర్దుబాటు అవుతాయి. పొదుపుగా లాభసాటిగా నీరు



ఉపయోగించడానికి నేల చదునుగా ఉండాలి.

**పంట ఉత్పత్తి**

ఎరువులు వేయడం:
నీరు పెట్టడం:
దమ్ము చేయడం:
చదునుచేయడం:

**విత్తడం:**విత్తనాలు విత్తే ముందు రైతులు ఏ వ్యాధిలేని విత్తనాలు ఎంపిక చేస్తారు. దీనివల్ల పంట దిగుబడి అధికంగా ఉంటుంది.
నారు నాటడం లేదా ఊడ్చడం:
దారులు చేయడం:

**కలుపు మొక్కల్ని తొలగించడం:** పొలాల్లో సాగు మొక్కలతోపాటు నేల, నీరు, పోషక పదార్థాలు వెలుతురుకూ పోటీ పడుతూ పెరిగే మనకు



అవసరం లేని మొక్కల్ని కలుపు మొక్కలు అంటారు.

**నీటి పారుదల:** మొక్కల పెరుగుదలకు, పంటల ఉత్పత్తులకూ నీరు చాలా అవసరం.

**ఎరువులు:**ఎరువులు మొక్కల పెరుగుదలకు వివిధ రకాల పోషకపదార్థాలు కావాలి. అవి కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, నత్రజని, ఫాస్ఫరస్, కాల్షియం, మెగ్నీషియం, ఇనుము, రాగి, మేంగనీస్, జింక్, మాలిబ్డినం, బోరేట్, క్లోరిన మొదలైనవి.
రసాయనిక ఎరువులు కర్మాగారాలలో తయారైన రసాయనాలు సహజ ఎరువులు మొక్కలను విఛ్చిన్న పరచి సహజ ఎరువులను తయారు చేస్తారు.

**పురుగు మందులు చల్లడం:**
**పంట కోయడం:**
**కోసిన పంటని ఎండబెట్టడం:**
**కట్టలు కట్టడం:**
**కుప్ప వేయడం:**
**నూర్చడం లేదా ధాన్యాన్ని వేరుచేయడం:**
**తూకం, బస్తాలు నింపడం:**

## దేశంలోని 9.8 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి పిఎం కిసాన్ కిస్తు బదిలీ



భాగల్పూర్(బీహార్) ఫిబ్రవరి 24 : ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 19వ విడత కిస్తు రూ. 22000 కోట్లను దేశంలోని 9.8 కోట్ల రైతుల ఖాతాల్లోకి సోమవారం బదిలీ చేశారు. ఇదిలావుండగా ప్రధాని నరేంద్ర మోడీ బీహార్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ముఖ్యమంత్రి నితీశ్ కుమార్,అనేక మంది కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఏలు, అధికారులు కూడా ఉన్నారు. దీనికి ముందు భారత అన్నదాతల జీవితాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వ కట్టుబడి ఉందని ప్రధాని మోడీ అన్నారు. 'ఎక్స్' వేదికగా 'మై గవర్నమెంట్ ఇండియా' ఖాతా నుంచి ఆయన ఓ పోస్ట్ పెట్టారు. అందులో 'మా అన్నదాతలు, వారి జీవితాలను మెరుగుపరచడానికి మా నిబద్ధత పట్ల మేము గర్విస్తున్నాము' అని పేర్కొన్నారు.

## కేదార్‌నాథ్ ఆలయం ఆదాయం రెట్టింపు



డెహ్రాడూన్ ఫిబ్రవరి 24 : కేదార్‌నాథ్ ఆలయానికి మొక్కులు, విరాళాలు, భక్తులకు అందించిన వివిధ సేవల ద్వారా వచ్చిన ఆదాయం 2021 మార్చి నుంచి రెట్టింపయిందని సమాచార హక్కు కింద అడిగిన ఓ ప్రశ్న ద్వారా వెల్లడయింది. 2020-21లో రూ.22.04 కోట్లు ఉన్న ఆదాయం, 202324లో రూ.52.9 కోట్లకు చేరుకుందని శ్రీ బద్రీనాథ్‌కేదార్‌నాథ్ మందిర్ సమితి తెలిపింది.నోయిడాలోని ఆర్‌టిఐ కార్యకర్త అమిత్ గుప్తా సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు ప్రతిగా ఈ సమాచారం అందింది. కేదార్‌నాథ్ మందిరం ఆదాయం 2.3 రెట్లు పెరిగిందని స్పష్టమయింది. కొవిడ్ తర్వాత భక్తుల రాక సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చిందని కూడా వెల్లడయింది. 202324లో ఇది రెట్టింపయిందని సమాచారం. కేదార్‌నాథ్ మందిరానికి భక్తులు మొక్కులు చెల్లించుకోవడం, విరాళాలు ఇవ్వడం, ప్రత్యేక దర్శనం ఫీజు, హెలికాప్టర్ల ద్వారా వచ్చే వారికి అదనపు ఫీజు తీసుకోవడం ద్వారా ఆదాయం వస్తోంది.

## ముస్లింల ఓట్లు అడిగే వారు

### మతకలహాలు నివారించలేక పోయారు



పాట్నా ఫిబ్రవరి 24 : లాలూ ప్రసాద్ యాదవ్ సారథ్యం లోని ఆర్జేడీ కాంగ్రెస్ మహాఘట్ బంధన్ కూటమిపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ' అధికారంలో ఉన్నప్పుడు ముస్లింల ఓట్లు పొందుతారు. కానీ మత కలహాలను నివారించడంలో విఫలం అయ్యారు ' అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ , రాష్ట్ర గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్ తదితరులు సోమవారం భాగల్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1989లో భాగల్‌పూర్‌లో జరిగిన మతకలహాల్లో దాదాపు వెయ్యిమంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో నితీశ్ కుమార్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.'2005లో తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చే వరకు పరిస్థితి ఏమిటి? రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉంది. ఫలితంగా ప్రజలు రాత్రి పొద్దుపోయే వరకు నిద్రపోయే వారు కాదు. ముస్లింల ఓట్లు అడిగే వారు దీన్ని నిలువరించలేకపోయారు ' అని పేరు చెప్పకుండానే ఆర్జేడీ కాంగ్రెస్ పార్టీల కూటమిపై నితీశ్ కుమార్ విమర్శలు చేశారు. 1990 లో అధికారం లోకి వచ్చిన ఆర్జేడీ ప్రభుత్వం కొనసాగిన 15 ఏళ్ల పాటు భాగల్‌పూర్ నిందితులకు శిక్ష పడలేదన్నారు. తమ ప్రభుత్వం బీహార్‌లో ఏర్పాటైన తరువాతనే రాష్ట్రంలో పరిస్థితులు మారాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనతో జరిగిన మత కలహాల్లో దోషులపై విచారణ జరిగిందని, వారికి శిక్ష పడిందని చెప్పారు.

## ఊబకాయం వ్యతిరేక ప్రచారకర్తలుగా ఒమర్ అబ్దుల్లా ప్రభృతులు



న్యూఢిల్లీ ఫిబ్రవరి 24 : ఆరోగ్య సమస్యలకు దారి తీసే ఊబకాయం నియంత్రణకు చర్యలు తీసుకోవలసిందిగా ప్రజలకు ఉద్బోధించిన మరునాడు సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ దీనిపై ప్రచారం కోసం వివిధ రంగాలకు చెందిన పది మంది వ్యక్తులను నామినేట్ చేశారు. వారిలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, వాణిజ్యవేత్త ఆనంద్ మహీంద్రా, నటుడు మోహన్‌లాల్ కూడా ఉన్నారు. 'ఊబకాయంపై పోరును బలోపేతం చేయడంలో, ఆహారంలో వంట నూనె వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పించడంలో తోడ్పడేందుకు ఈ దిగువ వ్యక్తులను నామినేట్ చేయదలిచాను. మన ఉద్యమం భారీ స్థాయికి చేరుకునేలా ఒక్కొక్కరు పది మందిని నామినేట్ చేయవలసిందిగా వారికి విజ్ఞప్తి కూడా చేస్తున్నాను' అని ప్రధాని మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. మోడీ నామినేట్ చేసిన ఇతర ప్రముఖుల్లో భోజ్‌పురి గాయక, నటుడు నిరాహువా, షూటింగ్ చాంపియన్ మను భాకర్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, నటుడు ఆర్ మాధవన్, గాయని శ్రేయా ఘోషల్, వితరణశీలి, ఎంపి సుధా మూర్తి కూడా ఉన్నారు. ఊబకాయంపై పోరు కోసం గట్టి కృషి జరగాలని ప్రధాని మోడీ ఆదివారం తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఉద్బోధిస్తూ, ఆహారంలో తక్కువగా నూనె వాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నూనె వాడకాన్ని పది శాతం మేర తగ్గించాలన్న సవాల్‌ను మరి పది మందికి విసరవలసిందిగా కూడా ఆయన ప్రజలను కోరారు. ఇది ఇలా ఉండగా, జెకె ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ, ఊబకాయానికి వ్యతిరేకంగా ప్రధాని మోడీ ప్రారంభించిన ప్రచారోద్యమంలో చేరడాన్ని తాను ఆనందిస్తున్నానని తెలియజేశారు. ప్రధాని ప్రచారోద్యమంలో చేరేందుకు పది మందిని కూడా సిఎం ఒమర నామినేట్ చేశారు. 'హృద్రోగం, టైప్ 2 మధుమేహం, పక్షవాతం, శ్వాసకోశ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు, ఆదుర్దా, కుంగుబాటు వంటి మానసిక ఆరోగ్య సమస్యలు పెక్కింటిని ఊబకాయం కలిగిస్తుంది. ఊబకాయానికి వ్యతిరేకంగా ప్రధాని ప్రచారోద్యమంలో చేరేందుకు ఈ దిగువ పది మందిని నేను నామినేట్ చేస్తూ, ఈ పోరును ముందుకు తీసుకువెళ్లేందుకు మరి పది మందిని నామినేట్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఒమర్ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. ఒమర్ నామినేట్ చేసిన వారిలో బయోకాన్ ఎండి కిరణ్ మజుందార్ షా, వాణిజ్యవేత్త సజ్జన్ జిందాల్, నటి దీపికా పడుకోణ్, మాజీ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా, మాజీ క్రికెటర్ ఇర్ఫన్ పఠాన్, ఎంపి సుప్రియా సూలె, మాజీ వుషు క్రీడాకారుడు కుల్దీప్ హండూ ఉన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు: రేవంత్ రెడ్డి




హైదరాబాద్ ఫిబ్రవరి 24 : మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్ హౌస్ లో కూర్చుని ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలు తిరస్కరించినా.. కెసిఆర్ లో మార్పు రాలేదని ఆరోపించారు. నిజామాబాద్ లోని పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ%ొ% బిజెపి, బిఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎందుకు పోటీ చేయట్లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెటిఆర్, కెసిఆర్ ను బిజెపి కాపాడుతోందని, బిజెపికి మద్దతివ్వకుంటే అరెస్టు తప్పదని బెదిరించారని చెప్పారు. అమెరికా వెళ్లిన ప్రభాకర్ రావు, శ్రవణ్ రావును ఎందుకు రప్పించట్లేదని అన్నారు. రెడ్ కార్నర్ నోటీసు ఇమ్మంటే కేంద్రం ఎందుకు ఇవ్వట్లేదని, ఈ కార్ రేసింగ్ కేసులో కెటిఆర్ ను ఈడి ఎందుకు అరెస్టు చేయట్లేదని, ప్రశ్నల వర్షం కురిపించారు. పదేళ్లలో కెసిఆర్ ఎందరో ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని, టిడిపి నుంచి తలసాని చేర్చుకుని, కాంగ్రెస్ నుంచి సబితని చేర్చుకుని మంత్రులను చేయలేదాననిమండిపడ్డారు. దిల్లీ లో రాష్ట్ర ప్రాజెక్టులను మెట్రో విస్తరణను కేంద్రమంత్రులు అడ్డుకుంటున్నారని వెల్లడించారు. కృష్ణా జలాల్లో మన వాటా పెరగకుండా, ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం పనులకు కూడా అడ్డుపడుతున్నారని తెలియజేశారు. రుణమాఫీ చేసింది నిజమైతేనే, సన్న వడ్లకు రూ. 500 బోనస్ వస్తేనే కాంగ్రెస్ కు ఓటేయండని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక



న్యూఢిల్లీ ఫిబ్రవరి 24: ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక అనంతరం అధికార, ప్రతిపక్షాల నినాదాల నడుమ సభ సోమవారం 15 నిమిషాల సేపు వాయిదా పడింది. బిజెపిని 'దళిత వ్యతిరేకి, సిక్కు వ్యతిరేకి' అని ఆప్ సభ్యులు ఆరోపించారు. మూడు సార్లు బిజెపి ఎంఎల్ఎ విజేందర్ గుప్తా సోమవారం ఎనిమిదవ ఢిల్లీ శాసనసభ తొలి సెషన్‌లో స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక కోసం ముఖ్యమంత్రి రేఖా గుప్తా, క్యాబినెట్ మంత్రి రవీందర్ ఇంద్రాజ్ రెండు తీర్మానాలు ప్రవేశపెట్టారు. మంత్రులు మన్‌జిందర్ సింగ్, పర్వేశ్ వర్మ తీర్మానాలను సమర్థించారు. తీర్మానాలను సభ మూజువాణి వోటుతో ఆమోదించింది. ప్రోటెమ్ స్పీకర్ అర్విందర్ సింగ్ లవ్లీ నిర్వహించిన ఎన్నిక అనంతరం కొత్త స్పీకర్ విజేందర్ గుప్తాను ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకురాలు ఆయన ఆసనం వరకు తోడ్కొని వెళ్లారు. కొత్త స్పీకర్‌ను ముఖ్యమంత్రి రేఖా గుప్తా అభినందిస్తూ, 'మీ అనుభవం, పరిజ్ఞానంసభలో విలువైనవిగా ఉంటాయి. మేము మాట్లాడేందుకు, మా అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు అవకాశం లభిస్తుంది. మీరు ఈ స్థాయికి చేరుకోవడానికి కష్టపడ్డారు. కానీ అటువంటి ఇబ్బందులు భవిష్యత్తులో ఎదురుకావని, మీరు సభకు సమర్థంగా సారథ్యం వహిస్తారని ఆశిస్తున్నాను' అని చెప్పారు. ప్రతిపక్ష నాయకురాలు ఆతిశీ కొత్త స్పీకర్ విజేందర్ గుప్తాకు శుభాకాంక్షలు తెలియజేస్తూనే, బిజెపి తీరు పట్ల నిరాశ వ్యక్తం చేశారు. 'దళిత వ్యతిరేకి, సిక్కు వ్యతిరేకి అయిన పార్టీ ఢిల్లీ అసెంబ్లీకి సారథ్యం వహిస్తుండడం దురదృష్టకరం. బిజెపి తన దళిత వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయంలో నుంచి బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్, షహీద్ భగత్ సింగ్ చిత్రపటాలను తొలగించింది' అని ఆతిశీ ఆరోపించారు.

## డబ్బు కోసం రెండో పెళ్లి.. చివరకు గట్టి షాకే తగిలింది



లక్నో ఫిబ్రవరి 24 : ప్రభుత్వం ఇచ్చే పథకాల కోసం కొందరు తప్పుదోవలో ప్రయత్నాలు చేస్తుంటారు. ఉచితాలు అందుకోవాలని రకరకాల వేషాలు వేస్తుంటారు. అయితే ఇందులో కొందరు సక్సెస్ అయితే.. మరికొందరు మాత్రం ఫన్నీగా దొరికిపోతారు. అలాంటి ఘటనే ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న సామూహిక వివాహాల్లో పాల్గొని నగదు, ఇతర బహుమతులు అందుకొనేందుకు రెండో పెళ్లికి సిద్ధమైంది ఓ మహిళ. దాన్ని అత్తింటి వాళ్లు అడ్డుకున్నారు. అత్తింటి వాళ్లు తెలిపిన వివరాల ప్రకారం. అస్మా అనే మహిళకు మూడు సంవత్సరాల క్రితం మహమ్మద్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి దీంతో ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిన అస్మా రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వివాహాలు నిర్వహిస్తోంది అని తెలుసుకుంది. తన బంధువు జుబేర్ అహ్మద్‌ను పెళ్లి చేసుకుంటే.. యోగి ప్రభుత్వం ఇచ్చే రూ.35 వేల నగదుతో పాటు ఇతర బహుమతులు కూడా కొట్టేయొచ్చు అని ప్లాన్ వేసింది. వచ్చిన డబ్బుతో చెరో గేదెను కొనుక్కోవాలని వారు నిర్ణయించుకున్నారు. ఇందుకోసం వాళ్లు ఆ వివాహానికి దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న అస్మా అత్తింటివారు సరిగ్గా పెళ్లి జరుగుతున్న సమయంలో వెళ్లి అడ్డకున్నారు. దీంతో సామూహిక నిబంధనలను ఉల్లఘించినందుకు, అనధికారికంగా లబ్ధి పొందాలని ప్రయత్నించినందుకు పోలీసులు అస్మా, జుబేర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# వెస్ట్‌బ్యాంక్‌పై పట్టు బిగిస్తున్న ఇజ్రాయెల్



**జెనిన్ ( వెస్ట్‌బ్యాంక్)ఫిబ్రవరి 24 నేస్తం :** ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోకి దశాబ్దాల తరువాత ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు ఆదివారం మొట్టమొదటిసారి ప్రవేశించాయి. వెస్ట్‌బ్యాంక్‌లో తమ దళాలు ఒక ఏడాది పాటు ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ప్రకటించిన తరువాత ఇది "ప్రమాదకరమైన దూకుడు"గా పాలస్తీనా అధికారవర్గాలు ధ్వజమెత్తుతున్నాయి. ఇజ్రాయెల్‌పై సాయుధ పోరుకు కేంద్ర స్థానంగా ఉన్న జెనిన్ లోకి ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులను పంపించింది. దశాబ్దాల క్రితం ఇజ్రాయెల్ దాడుల్లో సొంత ప్రాంతాలను వదిలిన శరణార్థుల వారసులే ఈ శిబిరాల్లో ఉంటున్నారు. గాజాలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న ఇజ్రాయెల్ ఇప్పుడిక వెస్ట్‌బ్యాంక్ పై దృష్టి కేంద్రీకరించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలు లోకి వచ్చిన రెండు రోజుల్లో భారీగా సైన్యాన్ని అక్కడికి తరలించింది. శరణార్థులుగా మారిన పాలస్తీనియన్లను తిరిగి వెస్ట్‌బ్యాంక్‌లోకి అడుగుపెట్టకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ఆపరేషన్ విస్తరిస్తోంది. వెస్ట్‌బ్యాంక్ నుంచి తమపై దాడులు పెరుగుతున్నందున ఈ ప్రాంతం నుంచి మిలిటెన్సీని రూపుమాపడమే లక్ష్మని ఇజ్రాయెల్ చెబుతోంది.న అయితే ఇక్కడున్న 30 లక్షల మందిని సైనిక పాలన కిందికి తేవడమే ఇజ్రాయెల్ లక్షమని పాలస్తీనియన్లు ఆరోపిస్తున్నారు. ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన దాడుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం జరుగుతోందని, వేలాది మందికి నిలువ నీడ కూడా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 40 వేల మంది పాలస్తీనియన్లు జెనిన్ వంటి పట్టణ ప్రాంత శరణార్థి శిబిరాలను ఖాళీ చేసి వెళ్లిపోయారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తెలిపారు. దీంతో అక్కడ కనీసం ఏడాదిపాటు ఉండేలా ఏర్పాట్లు చేయాలని మిలటరీకి ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. పాలస్తీనియన్లను తిరిగి అక్కడికి రానిచ్చేది లేదని, ఉగ్రవాదాన్ని పెరగనివ్వబోమని చెప్పారు. అయితే ఎంతకాలం పాలస్తీనియన్లను అడ్డుకుంటారో ఆయన స్పష్టం చేయలేదు. గాజాలో ఇజ్రాయెల్‌హమాస్ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో వెస్ట్‌బ్యాంక్‌లో హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఇజ్రాయెల్ కూడా ఈ ప్రాంతంపై పదేపదే దాడులకు పాల్పడింది. ఇక్కడ కనీసం 800 మంది చనిపోయారు. వీరిలో ఎక్కువ మంది మిలిటెంట్లేనని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అయితే గాజాతోపాటు లెబనాన్ లోనూ యుద్ధం జరుగుతున్నందున సంకీర్ణ పక్షాల నుంచి వచ్చిన ఒత్తిడుల కారణంగా ప్రధాని నెతన్యాహు వెస్ట్‌బ్యాంకులో మిలిటెన్సీ అణచివేత చర్యలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నప్పటికీ, ఇప్పుడు వెస్ట్‌బ్యాంకుపై పట్టు సాధించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. 1967లో జరిగిన యుద్ధంలో వెస్ట్‌బ్యాంక్, గాజా, తూర్పు జెరూసలెంను ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది. ఈ మూడు ప్రాంతాలను కలిపి స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలని పాలస్తీనియన్లు చిరకాలంగా కాంక్షిస్తున్నారు.

# 1600 మంది ఉద్యోగులకు ఉద్వాసన




**వాషింగ్టన్ ఫిబ్రవరి 24 :** డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే యుఎస్ ఎయిడ్ (యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్) సాయాన్ని 90 రోజుల పాటు నిలిపివేశారు. ట్రంప్ ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై సంతకం చేశారు. తాజాగా ఆ సంస్థకు చెందిన 1600 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి ప్రాంతంలో ఈ వివరాలను యుఎస్ ఎయిడ్ వెబ్‌సైట్ ద్వారా వెల్లడించింది. అత్యవసర సిబ్బంది మినహా యుఎస్ ఎయిడ్ తరఫున విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరూ పెయిడ్ లీవ్‌పై ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఉద్యోగుల సంఖ్యను కుదించే క్రమంలో 1600 మందిని ఇంటికి పంపించినట్లు సంస్థ తెలియజేసింది. ఫెడరల్ ప్రభుత్వ పరిమాణాన్ని కుదించాలన్న విస్తృత ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆరు దశాబ్దాలుగా ఉనికిలో ఉన్న యుఎస్ ఎయిడ్‌పై చర్య తీసుకోవాలన్నది తమ లక్షమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వ్యయ నియంత్రణ మిత్రుడు ఎలాన్ మస్క్ చెబుతూ వస్తున్నారు. దానికి తగినట్లుగానే తాజాగా ఆ ఉద్యోగులకు ఉద్వాసన పలికారు. యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు వేస్తారని ఊహాగానాలు వినిపించాయి. దీనితో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు ఈ విషయమై కోర్టుకు ఎక్కాయి. అయితే, శుక్రవారం కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చింది. ప్రభుత్వ ప్రణాళికను తాత్కాలికంగా అడ్డుకొని తమను ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరుతున్న ఉద్యోగుల పిటిషన్‌ను యుఎస్ జిల్లా జడ్జి కార్ల్ నికోల్స్ తిరస్కరించారు. ఈ క్రమంలోనే ఉద్యోగులను తొలగిస్తూ ఆదివారం రాత్రి ఉత్వర్వులు వెలువడ్డాయి. ఈ విషయమై వ్యాఖ్యానించవలసిందని కోరుతూ పంపిన సందేశాలకు యుఎస్ ఎయిడ్, యుఎస్ విదేశాంగ శాఖ నుంచి వెంటనే ఎటువంటి స్పందనలూ రాలేదు.

# వైమానిక దళ స్థావరంపై దాడి.. ఒకరు మృతి, పలువురికి గాయాలు



**ఫిబ్రవరి 24 :** ఓ వైమానిక దళ వైమానిక స్థావరంపై సోమవారం దుండగులు దాడి చేశారు. ఆ క్రమంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. అయితే ఈ దాడి ఎవరు చేశారు, ఎందుకు చేశారనే వివరాలు తెలియాల్సి ఉంది. బంగ్లాదేశÙ(%Bangladesh%) కాక్స్ బజార్ నగరంలోని వైమానిక దళ స్థావరంపై ఈరోజు ఆకస్మాత్తుగా దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మరణించగా, మరికొంతమంది గాయపడ్డారు. ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (%ఞా=%), బంగ్లాదేశ్ ఆర్మీ మీడియా విభాగం తెలిపిన వివరాల ప్రకారం, సమీపంలోని సమితి పారా ప్రాంతంలోని కొంతమంది దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని చెబుతున్నారు. దాడి సమయంలో జరిగిన కాల్పుల్లో ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు 30 ఏళ్ల యువకుడు అయిన షిహాబ్ కబీర్, ఆయన స్థానిక వ్యాపారవేత్తగా గుర్తించారు. ఆయన తుపాకీ గాయాలతో మరణించాడు. ఈ ఘటనలో మరికొంతమంది గాయపడ్డట్లు సమాచారం.

**ఈ దాడి ఎవరు చేశారు..**

ఈ దాడి నేపథ్యంలో బంగ్లాదేశ్ వైమానిక దళం పరిస్థితిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో వైమానిక దళం కూడా దాడులను ఎదుర్కొని కాల్పులు జరిపింది. సైన్యంతోపాటు ఇతర సెక్యూరిటీ బృందాలు ముష్కరులను ఎదుర్కొని, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ దాడికి సంబంధించిన పలు వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియా వైరల్ అవుతున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటివరకు ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఇంకా ఏ సంస్థ కూడా ప్రకటించలేదు.

**గతంలో కూడా దాడులు**

అయితే కాక్స్ బజార్ వైమానిక దళ స్థావరంపై జరిగిన ఈ దాడి మొదటిసారి కాదని నిపుణులు చెబుతున్నారు. గతంలో కూడా ఇలాంటి దాడులు జరిగాయన్నారు. కానీ తాజాగా జరిగిన ఎటాక్ మాత్రం, మరింత క్రూరంగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో భద్రతా చర్యలు పెంచాలని అధికారులు నిర్ణయించుకున్నారు. సైన్యంతో పాటు, పోలీసులు కూడా ముష్కరులను పట్టుకునేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రభుత్వంపై ఆగ్రహం..**

ఈరోజు ఉదయం 11.30 గంటల ప్రాంతంలో దుండగులపై వైమానిక దళ సిబ్బంది కూడా కాల్పులు జరపడంతో అనేక మంది గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. గత వారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేత మొహమ్మద్ బాబుల్ మియాను పలువురు కొట్టిచంపేశారు. దీంతో ఈ పార్టీ నేతలు ప్రభుత్వంపై ఆగ్రహంతో సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతోపాటు గతంలో కూడా మైనారిటీలపై పెరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో యూనస్ రాజీనామా చేయాలని అనేక మంది డిమాండ్ చేశారు. దీనికి తోడు మాజీ ప్రధాని షేక్ హసీనా తన పదవి నుంచి వైదొలిగినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో హింసాత్మక పరిణామాలు పెరుగుతున్నాయి.

## పోప్ ఫ్రాన్సిస్ కాస్త తేరుకున్నారు



**రోమ్: ఫిబ్రవరి 24 నేస్తం :** ఆసుపత్రిలో చేరి పది రోజులయ్యాక పోప్ ఫ్రాన్సిస్ తేరుకున్నారని వాటికన్ వర్గాలు తెలిపాయి. లంగ్ ఇన్‌ఫెక్షన్, మూత్ర పిండ లోపం కారణంగా ఆయన ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. 'ఆయన రాత్రి హాయిగానే గడిపారు, బాగా నిద్రపోయి రెస్ట్ తీసుకున్నారు' అని సోమవారం విడుదలైన మెడికల్ బుల్లెటిన్ పేర్కొంది. ఆయన కృత్రిమ లేక లిక్విడ్ న్యూట్రిషన్ తీసుకోకుండా స్వయంగా భోంచేస్తున్నారని వాటికన్ వర్గాలు తెలిపాయి. 88 పోప్ ఫ్రాన్సిస్ ఇటీవల తీవ్ర అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరారన్నది తెలిసిన విషయమే. పోప్ ఫ్రాన్సిస్‌కు ఉన్న తీవ్ర ముప్పు ఏమిటంటే ఆయనకు రక్త సంబంధమైన తీవ్ర రోగం 'సెప్సిస్' తో బాధపడుతున్నారు. దీర్ఘకాలంగా పనిచేసి పోప్ ఆయననే చెప్పాలి.


## శ్రీలంక జలాల్లో 32మంది భారత జాలర్ల అరెస్ట్



**కొలంబో, ఫిబ్రవరి 24 నేస్తం :** శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలతో 32 మంది భారత జాలర్లను ఆదివారం ఆ దేశ నౌకాదళ అధికారులు అరెస్ట్ చేశారు. జాలర్లు వాడిన ఐదు పడవలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక జలాల్లోకి విదేశీ మత్స్యకార పడవలు రాకుండా నిరోధించేందుకు తరచూ నిర్వహించే ఆపరేషన్‌లో భారత జాలర్లు పట్టుబడినట్టు ఆ దేశ నౌకాదళం ఓ ప్రకటనలో తెలిపింది. అరెస్టయిన జాలర్లతో పాటు పడవలను శ్రీలంకలోని తలైమన్నార్ ఓడరేవుకు తరలించినట్టు వెల్లడించింది. భారత్, శ్రీలంక సంబంధాల్లో జాలర్ల అంశం వివాదాస్పదంగా మారుతోంది. ఈ ఏడాది శ్రీలంక జలాల్లోకి ప్రవేశించిన 131 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసి, 18 పడవలను స్వాధీనం చేసుకున్నారు. 2024లో శ్రీలంక నౌకాదళం మొత్తం 529 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసింది.

## త్వరలో భారత్, చైనాపై పరస్పర సుంకాలు

-అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన
-విదేశీ నేరస్థులను సాగనంపుతున్నామని వ్యాఖ్య



**వాషింగ్టన్, ఫిబ్రవరి 24 :** భారత్, చైనా వంటి దేశాలపై త్వరలో పరస్పర సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. గతవారం ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా తాను చెప్పిన విషయాన్ని శుక్రవారం వాణిజ్య శాఖ కార్యదర్శి హెూవార్డ్ లుట్నిక్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పునరుద్ఘాటించారు. ఏ కంపెనీ అయినా, ఏ దేశమైనా అమెరికా వస్తువులపై ఎంతెంత సుంకాలు విధిస్తున్నాయో తాము కూడా అదే స్థాయిలో సుంకాలు విధించనన్నట్లు తెలిపారు. కొత్తగా పదవిలోకి వచ్చిన హెూవార్డ్ దీనికి బాధ్యత వహించబోతున్నారని తెలిపారు. తాము న్యాయంగా ఉండాలని భావిస్తున్నామని, అందుకే 'పరస్పరం' అంటున్నామని చెప్పారు. మరోవైపు, అక్రమ వలసదారుల గురించి ట్రంప్ మాట్లాడుతూ... వారి వెళ్లగొట్టి దేశంలో పేరుకుపోయిన బురదను కడిగేయడానికి కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు.

**భారత్‌కు మరో 12 మంది వలసదారులు**

తగిన అధికారిక పత్రాలు లేవన్న కారణంతో మరో 12 మంది భారతీయులను అమెరికా తిప్పి పంపించింది. వారు ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. అక్రమ వలసదార్లు అన్న పేరుతో తొలుత అమెరికా ప్రభుత్వం 299 మంది భారతీయులను పనామా పంపించింది. అందులో 171 మంది తిరిగి వచ్చేందుకు అంగీకరించారు. వారిలో ప్రస్తుతం 12 మంది స్వదేశానికి వచ్చారు.

## మహిళ కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు



హైదరాబాద్, ఫిబ్రవరి 24 :మియాపూర్‌లో మహిళను కిడ్నాప్ చేసి ఆపై రేప్ చేసిన కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులు.. చందానగర్‌కు చెందిన బల కుమార్, మహేష్‌లను అరెస్ట్ చేశామని ఏసీపీ శ్రీనివాసకుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి యాక్టివా బైక్‌తోపాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫిబ్రవరి 21వ తేదీన 100 డయల్‌కు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు వచ్చి.. మహిళను కిడ్నాప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఈ ఫిర్యాదును నిర్ధారించుకుని 3 గంటల వ్యవధిలో కిడ్నాప్‌నకు గురైన మహిళను కాపాడామని చెప్పారు. మహిళను కిడ్నాప్ చేసిన ఇద్దరు నిందితులను వెంటనే తాము గుర్తించామన్నారు. అయితే ఈ ఇద్దరు నిందితులపై పాత కేసులు సైతం ఉన్నాయని ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసకుమార్ వెల్లడించారు. కిడ్నాప్‌నకు గురైన మహిళపై నిందితులు ఇద్దరు అత్యాచారం చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని ఏసీపీ శ్రీనివాసకుమార్ చెప్పారు.

## వారిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారు..

### బండి సంజయ్‌కు రేవంత్ మాస్ సవాల్



మంచిర్యాల ఫిబ్రవరి 24 : ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అంటున్నారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసును పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా వాడుకున్నారని.. గొర్రెల కుంభకోణాన్ని ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాడు కుంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావును ఎందుకు తీసుకు రావడం లేదని బండి సంజయ్‌ను ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను ఎప్పుడు తీసుకువస్తారో బండి సంజయ్ చెప్పాలని నిలదీశారు. గొర్రెల స్కీమ్‌లో తాము కేసులు పెడితే ఈడీ మొత్తం ఫైళ్లను తీసుకెళ్లిందని...అందులో నిందితులను ఎప్పుడు అరెస్టు చేస్తారో చెప్పాలని నిలదీశారు. ఇవాళ(సోమవారం) మంచిర్యాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

## హైదరాబాద్‌లో చికెన్‌కు పడిపోయిన డిమాండ్..

### మటన్ చేపల ధరలకు రెక్కలు



హైదరాబాద్ ఫిబ్రవరి 24 : హైదరాబాద్‌లో చికెన్ ధరలు అంతకంతకూ పడిపోతుండటంతో మటన్, చేపల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ధరాభారం తట్టుకోలేక జనాలు గగ్గోలు పెడుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా గత కొన్ని రోజులుగా ప్రజలు చికెన్ పేరు చెబితే భయపడిపోయే పరిస్థితి వచ్చింది. అంత ఆందోళన అవసరం లేదని నిపుణులు చెబుతున్నా పరిస్థితిలో మార్పుల రాలేదు. దీంతో, కోళ్ల ఫారం యజమానుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. గత వారం రోజుల్లో మటన్‌కు డిమాండ్ ఏకంగా 40 శాతం పెరిగిందని షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. ఫలితంగా వాటి రేట్లు కూడా 17 శాతం మేర పెరిగాయి. వారం క్రితం కేజీ మటన్ ధర రూ.850 కాగా ప్రస్తుతం అది రూ.1000కి చేరుకుంది. చేపల ధరల్లో కూడా ఇదే మార్పులు కనిపిస్త్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కేజీ రూ.50 నుంచి రూ.100 వరకూ ధరలు పెరిగాయని అంటున్నారు. మరోవైపు, బర్డ్ ఫ్లూ భయాలు పెళ్లి వేడుకలపైనా పడింది. ఇప్పటికే అనేక మంది విందుభోజనాల్లో చికెన్‌కు బదులు మటన్, చేపలను చేరుస్తున్నారు. ధరలు ఎక్కువైనా వెనక్కు తగ్గకుండా మటన్, చేపల వైపు మళ్లుతున్నారు. బర్డ్ ఫ్లూ భయాలు ఎక్కువగా ఉన్న కారణంగా ప్రజలు తమ ఆహారపు అలవాట్లలో మార్పులు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా ఒకప్పుడు చికెన్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటే ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని అంటున్నారు. అయితే, ఈ పరిస్థితి ఇంకా ఎంత కాలం కొనసాగుతుందనేది దానిపై ఇంకా స్పష్టత లేదు.

# ట్యాపింగ్ కేసు.. కాంగ్రెస్ వదిలినా.. బీజేపీ వదలదు



హైదరాబాద్, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసును సీఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసు ఎలా ముందుకు వెళ్లదో తాము చూస్తామన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ పార్టీ వదిలినా.. బీజేపీ మాత్రం వదిలే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. చీకటి ఒప్పందాలు చేసుకునే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. మజ్లీస్, బీఆర్ఎస్, కమ్యూనిస్ట్ పార్టీలతోనే కాకుండా దేశ వ్యతిరేక శక్తులతో సైతం ఈ కాంగ్రెస్ పార్టీ చీకటి ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. బీజేపీ ఏం చెబుతుందో.. అదే చేస్తుందని.. ఏం చేస్తుందో అదే చెబుతామని ఆయన పేర్కొన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు తాము బెదరమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అనుమతిని రేవంత్ రెడ్డి సీఎం కాకముందే తాను తీసుకు వచ్చానని.. అలాంటి తనపైనే సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయి దిగజారి మరీ రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని చెప్పారు. ఆయనలాగా తాము మాట్లాడలేమన్నారు. తమకు కొద్దో గొప్పో నైతిక విలువలు ఉన్నాయని చెప్పారు. ఆ క్రమంలో ఎన్నో దశాబ్దాలుగా ఇదే పార్టీలో ఉండి.. ఇదే జెండాను మోస్తున్నామని వివరించారు. రేవంత్ రెడ్డిలాగా తాను పార్టీలు మారలేదని.. గంటకో మాట మాట్లాడలేదన్నారు. దెయ్యమన్నా సోనియాగాంధీ వద్దకు వెళ్లి దేవతంటూ ఆమె కాళ్లు పట్టుకోలేదంటూ రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి చురకలంటించారు. తనలాంటి వ్యక్తిని విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదన్నారు. యువతకు సీఎం రేవంత్ ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మారింది పాలకులు మాత్రమే కానీ.. పాలన కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తనదైన శైలిలో విమర్శించారు. పాలనలో రెండు పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. మార్చి 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలను బీజేపీ కైవసం చేసుకొంటుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కోసం తామంతా తీవ్రంగా కష్టపడ్డామని చెప్పారు. అందుకే రేవంత్ రెడ్డి కడుపు మంటగా ఉందన్నారు. ప్రభాకర్ రావు, శ్రవణ్ రావును తీసుకు వచ్చేందుకు విదేశాల్లో ఏమైనా బీజేపీ ప్రభుత్వం ఉందా? అని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి చురకలంటించారు. తాము ఎవరితో కుమ్మక్కయ్యామో చెప్పాలని సీఎం రేవంత్‌కూ నిలదీశారు. మార్చి 27వ తేదీన తెలంగాణలో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. మొత్తం 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం అంటే జనవరి 24వ తేదీన మూడు జిల్లాల్లో సూడిగాలి పర్యటన చేపట్టారు. ఆ క్రమంలో ఆయన పాల్గొన్న బహిరంగ సభల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తనదైన శైలిలో రేవంత్ రెడ్డి విరుచుకు పడ్డారు. ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి పై విధంగా స్పందించారు.

# కాంగ్రెస్ అగ్రనేతలకు అంజన్న మాస్ వార్నింగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 24 : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పినందుకే తెలంగాణలో కుల గణన సర్వే ఈ రేవంత్ ప్రభుత్వం నిర్వహించిందని అంజన్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. లేకుంటే వీళు ఈ సర్వేనే చేసే వారు కాదని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో అంజన్ కుమార్ యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీకి బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ చెప్పిందకే తనకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కిందని ఆయన పేర్కొన్నారు. తనకు ఈ పదవి దక్కకుండా చేసేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అడ్డు తగిలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కేంద్ర మంత్రి కాకుండా వీళ్లే అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. ఇక ఎన్నికల్లో ఓడిపోయే సమయంలో తనకు ఎంపీ టికెట్ ఇచ్చారని.. గెలిచే టైంలో మాత్రం తనకు ఎంపీ టికెట్ ఇవ్వలేదని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఓడిపోయి ఎంపీగా పోటీ చేస్తారని.. మరి జీవన్ రెడ్డి ఒడిపోయాడని.. ఆయనకు ఎంపీగా టిక్కెట్ మళ్లీ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. పక్క పార్టీలోని దానం నాగేందర్‌ను తీసుకు వచ్చి ఎంపీ టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి భజన సంఘాలు వచ్చాయని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తమకు ప్రాధాన్యత లేకుంటే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా రేవంత్ సారథ్యంలోని పార్టీలోని కీలక నేతలను అంజన్ కుమార్ యాదవ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# భక్తులకు గుడ్ న్యూస్ చెప్పిన టీజీఎస్ఆర్టీసీ..

# ఆరోజు ఏకంగా 3 వేల బస్సులు..




హైదరాబాద్ ఫిబ్రవరి 24 ౦హాశివరాత్రి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (%ు+ూ=ుజ%) భక్తులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు వెళ్లేందుకు 3,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక బస్సులు ఫిబ్రవరి 24 నుంచి ఫిబ్రవరి 28 వరకూ అందుబాటులో ఉంటాయని భక్తులకు తీపి కబురు చెప్పింది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకునే భక్తులకు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేబీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని టీజీఎస్?ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను 50 శాతం వరకూ పెంచినట్లు ఆయన వెల్లడించారు. అయితే సాధారణ సర్వీసుల టికెట్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదని సజ్జనార్ పేర్కొన్నారు. మరోవైపు ఏడుపాయలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు సవరించిన ఛార్జీలు ఫిబ్రవరి 26- 28 మధ్య వర్తిస్తాయని ఆయన తెలిపారు. గత శివరాత్రి కంటే ఈసారి ఆర్టీసీ యాజమాన్యం 809 అదనపు ప్రత్యేక బస్సులను నడుపుతోందని చెప్పుకొచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక సేవలను ఉపయోగించి దేవాలయాలకు సురక్షితంగా వెళ్లి దర్శనం చేసుకోవాలని సజ్జనార్ ఆకాంక్షించారు. అయితే మహాశివరాత్రి ప్రత్యేక బస్సులలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం అమలులో ఉంటుందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. %షష్.స్త్రంతీఎఎబం.ఱఅ% వెబ్‌సైట్‌లో బస్ టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. మహా శివరాత్రి ప్రత్యేక బస్సుల గురించి మరిన్ని వివరాల కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

# రికార్డులు బ్లాస్ట్

పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో చెలరేగి ఆడాడు. అజేయ శతకంతో జట్టుకు ఒంటి చేత్తో విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ మొత్తంగా 111 బంతులు ఎదుర్కొన్నాడు 7 ఫోర్ల సాయంతో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో పలు రికార్డులను కోహ్లీ బద్దలు కొట్టాడు.



“ చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం దాయాది పాకిస్థాన్‌పై భారత్ ఆరు వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. మాస్టర్ ఛేజర్ విరాట్ కోహ్లీ ఆ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగి టీమిండియాకు స్వీట్ విక్టరీని అందించాడు. ఆ ఓటమితో టోర్నీ నుంచి దాదాపు ఔటైన పాకిస్థాన్ జట్టు నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. మ్యాచ్ ముగిసిన తర్వాత పాకిస్థాన్ కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ మీడియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సెంచరీ హీరో విరాట్‌పై రిజ్వాన్ ప్రశంసలు కురిపించాడు. చాలా ఈజీగా విరాట్ తన ఇన్నింగ్స్ ఆడిన తీరును రిజ్వాన్ మెచ్చుకున్నాడు. విరాట్ ఫిట్‌నెస్ అమోఘమని పేర్కొన్నాడు. 36 ఏళ్ల వయసులో ఇండియన్ బ్యాటర్ అంత ఫిట్‌నెస్ ఎలా మెంటేన్ చేస్తున్నాడన్న ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. ”

## అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు..

కీలక ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఐసీసీ ఈవెంట్లలో ఒకే జట్టుపై అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలుచుకున్న ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. పాక్ పై 5 సార్లు కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందుకున్నాడు. 2012 టీ20 ప్రపంచకప్, 2015 వన్డే ప్రపంచకప్, 2016 టీ20 ప్రపంచకప్, 2022 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ లలో పాక్ పై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా కోహ్లీ నిలిచాడు. మరే ప్లేయర్ కూడా ఒకే జట్టుపై మూడు లేదా అంతకంటే ఎక్కువ అవార్డులు సాధించకపోవడం గమనార్హం.

## వన్డేల్లో ఫాస్టెస్ట్ 14 వేల రన్స్..

ఈ మ్యాచ్‌లో వ్యక్తిగత స్కోరు 15 పరుగుల వద్ద కోహ్లీ వన్డేల్లో 14 వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 14 000 పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డులకు ఎక్కాడు. ఈ క్రమంలో దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. సచిన్ 350 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని చేరుకోగా కోహ్లీ కేవలం 287 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించాడు.

### చాంపియన్స్ ట్రోఫీలో మొదటిది

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో విరాట్ కోహ్లీకి ఇది తొలి సెంచరీ. ఈ ఇన్నింగ్స్‌కు ముందు అతడు ఐదు అర్ధశతకాలతో 551 పరుగులు చేశాడు.

## అత్యధిక పరుగులు చేయడంలో 3వ స్థానం

అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్లలో కలిపి )అత్యధిక పరుగులు చేసిన మూడో ఆటగాడిగా కోహ్లీ నిలిచాడు. ఈ క్రమంలో అతడు ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు రికీ పాంటింగ్ (27,483పరుగులు)ను అధిగమించాడు. కోహ్లీ ఖాతాలో ప్రస్తుతం 27, 503 పరుగులు ఉన్నాయి. ఈ జాబితాలో 34,357 పరుగులతో సచిన్ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తరువాత సంగక్కర 28,016 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు.

## అన్ని ఫార్మాట్లలో కలిపి 82వ సెంచరీ..

పాక్ పై తాజా సెంచరీ విరాట్ కోహ్లీకి వన్డేల్లో 51వ శతకం. కాగా.. అంతర్జాతీయ క్రికెట్‌లో(మూడు ఫార్మాట్లలో కలిపి) 82వ సెంచరీ కావడం గమనార్హం. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన రికార్డు సచిన్ పేరిట ఉంది. సచిన్ 100 శతకాలు చేశాడు. ఈ జాబితాలో విరాట్ రెండో స్థానంలో ఉన్నాడు.

## అత్యధిక క్యాచ్‌లు..

వన్డేల్లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత ఫీల్డర్‌గా కోహ్లీ రికార్డులకు ఎక్కాడు. పాక్‌తో మ్యాచ్‌లో నసీమ్ షా క్యాచ్ అందుకున్న క్రమంలో విరాట్ ఈ రికార్డును చేరుకున్నాడు. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ అజారుద్దీన్ రికార్డును బ్రేక్ చేశాడు. 334 వన్డేల్లో అజారుద్దీన్ 156 క్యాచ్‌లు అందుకోగా, 299 మ్యాచ్‌ల్లోనే కోహ్లీ 157 క్యాచ్‌లు అందుకోవడం విశేషం.

## పాక్ పై ఏకైక బ్యాటర్..

తాజా సెంచరీతో వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లలో పాకిస్తాన్ పై సెంచరీ చేసిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా కోహ్లీ నిలిచాడు.

## అనుష్క శర్మ పోస్ట్ వైరల్

ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం నమోదు చేసింది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. కొంతకాలంగా తనపై వస్తున్న విమర్శలకు విరాట్ అద్భుత శతకంతో సమాధానమిచ్చాడు. విరాట్ మళ్లీ ఫామ్ అందుకోవడంతో అభిమానులు జోష్‌లో ఉన్నారు. ఈ క్రమంలోనే తన సతీమణి, నటి అనుష్క శర్మ కూడా కింగ్ సెంచరీపై ఆనందం వ్యక్తం చేసింది. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఫొటో షేర్ చేసింది. ఇండో పాక్ మ్యాచ్‌ను ఇంటి నుంచే వీక్షించిన అనుష్క, టీవీలో విరాట్ సెంచరీ సంబరాలను ఫొటో తీసి షేర్ చేసింది. దానికి 'లవ్', 'హైఫై' ఎమోజీలను జత చేసి తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఇక సెంచరీ చేసిన తర్వాత కోహ్లీ తన మెడలోని గొలుసుకున్న వెడ్డింగ్ రింగ్‌ను ముద్దాడాడు. అనుష్కకు సందేశమిచ్చేలా కెమెరాకు విజయసంకేతం చూపించాడు. ప్రస్తుతం అనుష్క పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## కింగ్ కోహ్లీ సెంచరీ..
# పాక్‌లో సంబరాలు

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి క్రికెట్‌లో సపరేట్ ఫ్యాన్‌బేస్ ఉంటుంది. కేవలం భారత్ నుంచే కాకుండా విరాట్‌కు వరల్డ్‌వైడ్‌గా కోట్లలో ఫ్యాన్స్ ఉంటారు. కింగ్ కోహ్లీ ఫ్యాన్‌బేస్‌కు లిమిట్స్ లేవు. దాయాది దేశం పాకిస్తాన్‌లోనూ విరాట్‌కు 'డైహార్డ్ ఫ్యాన్స్' ఉంటారు. ఛాంపియన్స్ ట్రోఫీలో తాజా మ్యాచ్‌తో అది మరోసారి నిరూపితం అయ్యింది. పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో విరాట్ సెంచరీని ఆ దేశ అభిమానులు తెగ ఎంజాయ్ చేశారు. దుబాయ్ వేదికగా ఆదివారం భారత్ పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇస్లామాబాద్‌లోని కొంతమంది అభిమానులు బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసుకొని లైవ్ మ్యాచ్ చూశారు.ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడిపోతుందని అక్కడ కొంతమంది అభిమానులు నిరాశ చెందుతుంటే, మరి కొందరు మాత్రం విరాట్ సెంచరీని సెలబ్రేట్ చేసుకున్నారు. అతడు సెంచరీ మార్క్ అందుకోగానే



కేరింతలు, చప్పట్లు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. 'కోహ్లీ', 'కోహ్లీ' అంటూ హుషారుగా అరుస్తూ సంబర పడిపోయారు.

### నెటిజన్ల రియాక్షన్

ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనికి నెటిజన్లు స్పందిస్తున్నారు. పాకిస్తాన్‌లోని విరాట్ ఫ్యాన్స్ అతడి మాస్టర్ క్లాస్‌ను మెచ్చుకుంటున్నారని అన్నారు. ఇది 'బ్యూటీ ఆఫ్ క్రికెట్', క్రికెట్‌లో ఇది నిజమైన విజయం', 'ఒరిజినల్ కింగ్ ఎవరో వాళ్లకు తెలుసు' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

JioHotstar

## దాయాదుల యుద్ధానికి అత్యధిక వ్యూస్

- జియో హాట్‌స్టార్‌లో 60.2 కోట్ల మంది మ్యాచ్‌ను వీక్షించిన వైనం
- భారత్ లక్ష్య ఛేదనకు దిగిన సమయంలో 33.8 కోట్లుగా ఉన్న వ్యూస్

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయ్ వేదికగా భారత్, పాక్ మధ్య ఆదివారం జరిగిన హైవోల్టేజ్ మ్యాచ్ వ్యూస్ పరంగా నంబర్ వన్‌గా నిలిచింది. జియోహాట్‌స్టార్‌లో దాయాదుల పోరుకు ఏకంగా 60.2 కోట్ల రికార్డు స్థాయి వ్యూస్ వచ్చాయి. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభించిన సమయంలో 6.8 కోట్లు ఉన్న వ్యూస్.. ఆ జట్టు ఆఖరి ఓవర్ ఆడుతున్న సమయంలో వీక్షకుల సంఖ్య 32.1 కోట్లకు చేరింది. ఇక పాక్ ఇన్నింగ్స్ బ్రేక్ అయిన సమయంలో 32.2 కోట్లకు చేరుకుంది. ఇక భారత్ లక్ష్య ఛేదనకు దిగిన సమయంలో 33.8 కోట్లుగా ఉన్న వ్యూస్.. విరాట్ కోహ్లీ శతకం చేసి మ్యాచ్‌ను గెలిపించే సమయానికి 60.2 కోట్లకు చేరి రికార్డు సృష్టించింది. గతంలో ఏ క్రికెట్ మ్యాచ్‌కూ ఇన్ని వ్యూస్ రాలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంతకుముందు 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్‌తో తలపడినప్పుడు డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో అత్యధికంగా 3.5 కోట్ల వ్యూస్ నమోదయ్యాయి. అంతకుముందు ఆసియా కప్‌లో దాయాదుల పోరును గరిష్ఠంగా 2.8 కోట్ల మంది వీక్షించారు. కాగా, నిన్నటి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మరోసారి బ్యాట్ ఝుళిపించిన విషయం తెలిసిందే. అద్భుతమైన అజేయ శతకం (100)తో టీమిండియాకు గ్రాండ్ విక్టరీని అందించాడు రన్ మెషీన్. ఇక ఈ సెంచరీతో పలు రికార్డులను సైతం తన ఖాతాలో వేసుకున్నాడు.

## 36ఏళ్ల వయసులో విశ్రాంతి అవసరం : విరాట్ కోహ్లీ

కోహ్లీ తన ఇన్నింగ్స్ పై స్పందించాడు. మిడిల్ ఓవర్లలో ఎలాంటి రిస్క్ లేకుండా స్పిన్నర్లను ఎదుర్కొనడమే తన పని అని చెప్పుకొచ్చాడు. శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లు చాలా చక్కగా ఆడారని కొనియాడాడు. లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ ఔటైనా సరే వెంటనే వచ్చి రాణించడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నాడు. గత మ్యాచ్‌లో ఏం నేర్చుకున్నామో అర్థం చేసుకోవాలి. ఈ మ్యాచ్ తనకు సాధారణ వన్డే గేమ్ ఆడేందుకు అనుమతించిందన్నాడు. ఆఖర్లో శ్రేయస్ అయ్యర్ ధాటిగా ఆడాడని, తాను కొన్ని బౌండరీలు సాధించినట్లు తెలిపాడు. బయట తన గురించి ఏమనుకుంటారో అనే విషయాన్ని తాను పట్టించుకోనని కోహ్లీ చెప్పాడు. తన ఆట పై తనకు పూర్తి అవగాహన ఉందన్నాడు. మైదానంలో ప్రతి బంతికి 100 శాతం కష్టపడి ఆడతానని, ఈ రోజు దేవుడు దయతలిచి శతకం రూపంలో రివార్డు ఇచ్చాడన్నారు.

### అందుకే అతడు నంబర్ వన్..

పాక్ పేసర్ షాహీన్ అఫ్రిది బౌలింగ్‌ను ఓపెనర్ శుభ్‌మన్ గిల్ చాలా చక్కగా ఆడాడని, అందుకే అతడు వన్డేల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడని కోహ్లీ మెచ్చుకున్నాడు. లక్ష్య ఛేదనలో పవర్ ప్లేలో 60 నుంచి 70 పరుగులు చేయాల్సిన అవసరం ఉంటుందన్నాడు. ఇక నంబర్ 4లో వస్తున్న శ్రేయస్ అయ్యర్ చక్కగా ఆడుతున్నాడు. భారత్‌లో ఆడినట్లుగానే చెలరేగి ఆడాడు. తదుపరి మ్యాచ్‌కు వారం రోజుల సమయం దొరకడం చాలా మంచిది. వాస్తవం చెప్పాలంటే 36 వయసులో ఇలాంటి ఇన్నింగ్స్‌లు ఆడాలంటే తగినంత విశ్రాంతి కావాలని కోహ్లీ అన్నాడు.

## బౌలర్లదే క్రెడిట్ :రోహిత్ శర్మ



టీమ్ఇండియా విజయం పై మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. పాక్ పై విజయం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నాడు. ఈ మ్యాచ్‌లో పాక్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీనిపై హిట్‌మ్యాన్ మాట్లాడుతూ.. బంతితో బౌలర్లు ఆరంభించిన తీరు బాగుందన్నాడు. బౌలర్లు గొప్పగా బంతులు వేసి పాక్‌ను చాలా తక్కువ స్కోరుకే పరిమితం చేశాడని తెలిపారు. దుబాయ్ పిచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం చాలా ఈజీ అని చెప్పుకొచ్చాడు. పిచ్ స్లో గా మారుతుందనే విషయం తమకు తెలుసునన్నాడు. బ్యాటింగ్‌లో అనుభవం ఉన్న ప్లేయర్ రాణించాలని కోరుకున్నట్లుగా చెప్పుకొచ్చాడు.

### ఆ ముగ్గురు సూపర్

అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజాలదే ఈ గెలుపు క్రెడిట్. ఈ ముగ్గురు మిడిల్ ఓవర్లలో చాలా చక్కగా బంతులు వేశారని మెచ్చుకున్నాడు. ఇక రిజ్వాన్‌షకీల్ అద్భుత భాగస్వామ్యం పై రోహిత్ శర్మ మాట్లాడుతే.. వారిద్దరు చక్కగా ఆడారన్నాడు. వీలైనంత త్వరగా సదరు భాగస్వామ్యాన్ని విడదీయాలని అనుకున్నట్లుగా తెలిపాడు. స్పిన్నర్లు తమ అనుభవాన్ని ఉపయోగించి చక్కగా బౌలింగ్ చేసి మ్యాచ్ పై పట్టు సాధించేలా చేశారన్నాడు. పేసర్లు షమీ, హార్దిక్, హర్షిత్‌లు సైతం చక్కగా బౌలింగ్ చేశారని చెప్పుకొచ్చారు. ఇక ఆరు బౌలింగ్ ఆప్షన్స్ ఉండడంతో కొందరు 10 ఓవర్ల కోటాను వేయలేకపోతున్నారన్నాడు.

### కోహ్లీ శతకానికి ఆశ్చర్యపోలేదు..

గత కొన్నేళ్లుగా కోహ్లీ ఇలాగే రాణిస్తున్నాడని, అతడి సెంచరీ చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న వారు ఎవరూ ఆశ్చర్యపోలేదన్నారు. ఇలాంటి తరహా ఇన్నింగ్స్ ఆడాలని కోహ్లీ భావిస్తూ ఉంటాడన్నారు. చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించడం బాగుందన్నాడు. కోహ్లీతో పాటు గిల్, అయ్యర్ సైతం కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నట్లుగా రోహిత్ చెప్పుకొచ్చాడు. ఇక తనకు ఎలాంటి గాయం కాలేదని, తొడ కండరాలు పట్టేయడంతోనే మైదానాన్ని వీడినట్లుగా చెప్పాడు. ప్రస్తుతం అంతా బాగానే ఉందన్నాడు.

## పాక్‌కు ఇంకా సెమీస్ అవకాశాలు

ఛాంపియన్స్ ట్రోఫీ రూపంలో దాదాపు 29 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ ఓ ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇస్తోంది. అలాగే ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గాను బరిలోకి దిగింది. అయితే, ఆతిథ్య జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైంది. దీంతో పాక్‌కు సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. ఇంకా చెప్పాలంటే ఆ జట్టు దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించినట్టే! అయితే, ఈ రోజు న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మధ్య జరిగే మ్యాచ్‌తో పాకిస్థాన్ భవితవ్యం తేలిపోనుంది. ఈ మ్యాచ్‌లో కివీస్ విజయం



సాధిస్తే.. గ్రూప్‌ఏ నుంచి న్యూజిలాండ్, భారత్ సెమీస్ కు వెళతాయి. బంగ్లా, పాక్ నాకౌట్ దశ నుంచే ఇంటిముఖం పడతాయి. ఒకవేళ న్యూజిలాండ్ ఓడితే మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు సెమీ ఫైనల్ అవకాశాలు ఉంటాయి. అది ఎలాగో, సమీకరణాలు ఎలా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### సమీకరణాలు ఇలా...

- ఇవాళ్టి మ్యాచ్‌లో కివీస్‌ను బంగ్లా ఓడించాలి
- ఈ నెల 27న బంగ్లాతో జరిగే మ్యాచ్‌లో తప్పకుండా పాక్ గెలవాలి
- మార్చి 2న న్యూజిలాండ్‌తో జరిగే పోరులో భారత్ విజయం సాధించాలి
- ఇలా జరిగితే గ్రూప్‌ఏలో టీమిండియా 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలుస్తుంది. మిగతా మూడు జట్లు చెరో 2 పాయింట్లతో సమానంగా ఉంటాయి. అప్పుడు మెరుగైన నెట్ రన్‌రేట్ ఉన్న టీమ్.. భారత్‌తో పాటు సెమీస్‌కు చేరుతుంది.




# ట్రెండీ లుక్‌లో మృణాళిని

ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్స్ నుండి హీరోయిన్స్‌గా మారినవారు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారిలో మృణాళిని రవి ఒకరు. మృణాళిని రవి డెబ్యూ తమిళంతో పాటు తెలుగులో కూడా ఒకేసారి జరిగింది. తమిళంలో 'సూపర్ డీలక్స్' సినిమాతో, తెలుగులో 'గద్దలకొండ గణేశ్'తో ఒకేసారి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది మృణాళిని. తెలుగులో తనకు తర్వాత పెద్దగా అవకాశాలు రాకపోయినా కోలీవుడ్ మాత్రం తనకు బాగానే వెల్‌కమ్ చెప్పింది. మృణాళిని రవి ఆ తర్వాత నటించిన తెలుగు సినిమాలు మాత్రం పెద్దగా హిట్ అవ్వలేదు. తమిళంలో అయితే విక్రమ్, విశాల్ లాంటి హీరోలతో జోడీకట్టి మంచి హిట్లు తన ఖాతాలో వేసుకుంది మృణాళిని. తాజాగా ఆరెంజ్ కలర్ లంగా ఓణీలో దేశీ లుక్‌తో అందరినీ ఆకట్టుకుంటోంది మృణాళిని రవి.



# నాని లుక్ అదిరిపోయింది..

నేచురల్ స్టార్ నాని ప్రతీ సినిమాతో కూడా డిఫరెంట్ కంటెంట్ తో సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. ఎలాంటి సినిమా చేసినా కూడా అందులో ఏదో ఒక కొత్త పాయింట్ ఉండాల్సిందే. అయితే ఈసారి హిట్ 3లో నాని ఎంచుకున్న పాత్ర ఊహాలకందని ఊచకోత తరహాలో ఉన్నట్లు అనిపిస్తోంది. అర్జున్ సర్కార్ అనే పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా, నాని తన అగ్రెసివ్ యాటిట్యూడ్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అతని లుక్, బాడీ లాంగ్వేజ్, ఎక్స్‌ప్రెషన్స్ మొత్తం కొత్తగా ఉన్నాయి. నేడు నాని పుట్టినరోజు సందర్భంగా రిలీజైన టీజర్‌లో నాని ఊచకోత అంటే ఏంటో చూపించాడు. కాశ్మీర్ బ్యాక్ డ్రాప్స్, టెర్రర్ అలాగే మర్డర్ మిస్టరీ లాంటి అంశాలు గట్టిగానే ఉన్నట్లు అర్థమవుతుంది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి హిట్ సీరీస్ ను యాక్షన్ బ్యాక్ డ్రాప్ గట్టిగానే ప్లాన్ చేసినట్లు అర్థమవుతుంది. ఇక అతని లాటికి దొరికితే విలన్స్ కు కష్టమే అన్నట్లు క్యారెక్టర్ ను హైలెట్ చేశారు. హిట్ 1, 2లతో పోలిస్తే, ఈ సినిమాలో యాక్షన్ కూడా డబుల్ అయింది. నాని హిట్ 3లో అందించే థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ వేరే స్థాయిలో ఉంటుందని చెప్పవచ్చు. ఇక హిట్ 3 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. ఇక టీజర్ కంటే సినిమా ఇంకెంత వయలెంట్‌గా, థ్రిల్లింగ్‌గా ఉండబోతుందో చూడాలి.



# సోనారికా బికినీ ట్రీట్

తెలుగులో వరుసగా యువహీరోల సరసన అవకాశాలు అందుకుంది ఉత్తరాది బ్యూటీ సోనారిక బదోరియా. జాదుగాడు చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఈ బ్యూటీ, ఆ తర్వాత నాగశౌర్య సరసన నటించింది. బెల్లంకొండ 'స్పీడున్నోడు' లోనూ సోనారికా నటించింది. 'ఈడోరకం ఆడోరకం'లో మంచు హీరోతో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్ కి వెళ్లింది. ఇంద్రజిత్ అనే తమిళ చిత్రంలోనూ నాయికగా నటించింది. నిజానికి ఈ బ్యూటీ ఆరంభం టీవీ సీరియళ్లతో పాపులరైంది. హిందీలో హరహర మహదేవ్ సీరియల్ తో సోనారిక నటిగా మంచి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఓటీటీలో అవకాశాలొస్తున్నాయని కథనాలొచ్చాయి. మరోవైపు సోనారిక సోషల్ మీడియాల్లోను స్పెషల్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా ఈ బ్యూటీ బికినీ ట్రీట్ యువతరంలో చర్చగా మారింది. అద్భుతమైన ఆనందాలతో పూల్ సైడ్ ప్యారడైజ్ అంటూ అందమైన బ్లూ స్విమ్ సూట్ ఫోటోగ్రాఫ్స్ ని షేర్ చేసింది. పూల్ లో ఈతకు వెళుతున్న ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి.





# నా ప్రేమ ఇలా ఓ ప్రశ్నయ్యేనా

సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటిస్తున్న సినిమా 'ఆర్టిస్ట్'. రతన్ రిషి దర్శకుడు. జేమ్స్ వాట్ కొమ్ము నిర్మాత. త్వరలోనే సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఓ ప్రేమ.. ప్రేమ..' అంటూ సాగే ఈ గీతాన్ని రాంబాబు గోసాల రాయగా, సురేష్ బొబ్బిలి స్వరపరిచారు. రమ్య బెహర ఆలపించారు. 'జారే కన్నీరే అడుగుతుందా.. నేరం ఏముందో చెప్పమంటూ.. నా ప్రేమ ఇలా ఓ ప్రశ్నయ్యేనా.. నా మౌనం ఇలా ఈ బదులిచ్చేనా' అంటూ విషాద ప్రేమను ఆవిష్కరిస్తూ ఎమోషనల్‌గా ఈ పాట సాగింది. తనికెళ్ల భరణి, సత్యం రాజేష్, ప్రభాకర్, వినయ్ శర్మ, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: చందూ ఏజే.

## బాలయ్య బ్యూటీ..

# బంపర్ ఆఫర్ కొట్టేసింది!

సౌత్‌లో ఇప్పుడు బాగా వినిపిస్తున్న పేరు ఊర్వశి రౌతేలా. ఇప్పటి వరకు 'వాల్తేరు వీరయ్య', 'బ్రో' చిత్రాల్లో ఊర్వశి ఐటెం సాంగ్స్ చేయగా, తాజాగా బాలకృష్ణ బ్లాక్ బస్టర్ మూవీ 'డాకు మహారాజ్' చిత్రంలో దబిడి దిబిడి ఐటెం సాంగ్ తో మరింత పాపులారిటి దక్కించుకుంది. ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమ్రోగిపోతుంది.. ముఖ్యంగా ఈ మూవీలో పాట మాత్రమే కాకుండా పోలీస్ గా ఆమె పాత్రలో గ్లామర్ తో పాటు యాక్షన్ కూడా బాగానే హైలైట్ అయింది. దీంతో ప్రస్తుతం ఊర్వశి దృష్టి మొత్తం సౌత్ ఇండస్ట్రీ మీద ఉంది. అయితే తాజాగా ఈ హాట్ బ్యూటీ మరో బంపర్ ఆఫర్ కొట్టేసింది. స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కలయికలో మూవీ రాబోతున్న విషయం తెలిసిందే. ఈ పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాలో తారక్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటించబోతుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ మూవీలో ఊర్వశి రౌతేలా ఛాన్స్ కొట్టేసిందట. అంతేకాదు వచ్చే షెడ్యూల్ లో ఊర్వశి రౌతేలా కూడా షూట్‌లో జాయిన్ కానుందట.. ఈ వార్త గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

# కొత్త బిజినెస్ స్టార్ట్..



ఐటమ్ గాళ్ గా గుర్తింపు పొందిన ముమైత్ ఖాన్.. ప్రస్తుతం బిజినెస్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చారు. "వీలైక్ మేకప్ & హెయిర్ అకాడమీ" ప్రారంభించారు ముమైత్ ఖాన్. ఈ అకాడమీలో బ్రైడల్, మేకప్, హెయిర్ స్టైలింగ్, కాస్మోటాలజీ, స్కిన్‌కేర్, వెల్‌నెస్ వంటి రంగాలలో నైపుణ్యం పొందిన వ్యక్తులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. యూసుఫ్‌గూడలో జరిగిన కార్యక్రమంలో ముమైత్ ఖాన్ కు తోడుగా కోఫౌండర్స్ కెయిత్, జావేద్, ఆర్టిస్టులు జ్యోతి, అక్స ఖాన్, సింగర్ రోల్ రైడా, డ్యాన్స్ మాస్టర్ జోసఫ్ ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. అకాడమీ, సమగ్ర పాఠ్యప్రణాళిక, అత్యాధునిక సౌకర్యాలు, పరిశ్రమప్రముఖ బోధకుల బృందంతో విద్యార్థులకు శక్తివంతమైన శిక్షణను అందించటానికి పయనమైంది. "ప్రపంచ స్థాయి లో ట్రెయిన్డ్ స్పెషలిస్టులుగా తయారుచేయడం మా లక్ష్యం" అని ముమైత్ ఖాన్ అన్నారు. "మేము శిక్షణా పద్ధతుల ద్వారా, విద్యార్థుల అభిరుచిని అభివృద్ధి చేసుకోవడంలో సహాయం చేస్తాం" అని కోఫౌండర్లు కెయిత్, జావేద్ తెలిపారు. ఈ అకాడమీ, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లను అందిస్తూ, యువతకు పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణను ఇస్తుంది. వాస్తవ ప్రపంచ అనుభవాలతో విద్యార్థులు పోటీ మార్కెట్లో ముందంజ వేయాలని ముమైత్ ఖాన్ ఉద్దేశించారు.